ఆదివారం
03-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 12
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రుణ భారతం

మోదీ హయాంలో అప్పులు 111.34 శాతం పెరుగుదల

- తగ్గిన విదేశీ పెట్టుబడులు
- పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశం అథోగతి పాలయ్యింది. అస్తవ్యస్త ఆర్థిక విధానాలు, ఏకపక్ష నిర్ణయాలు, రైతు, కార్మిక వ్యతిరేక చర్యలు, విద్య కాషాయీకరణ, మతోన్మాద, హింసాత్మక ధోరణులతో అల్లాడిపోతోంది. పారదర్శక పాలన అంటూ ప్రగల్భాలు పలికే నరేంద్ర మోదీ పేద వర్గాల నుంచి అడ్డంగా దోచి బడా కార్పొరేట్‌లకు కట్టబెట్టే విధానాలను యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రజలకు మేలు చేయకపోగా, దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు.

దేశంపై ఉన్న మొత్తం అప్పు 2022 మార్చి 31 నాటికి రూ.1,33,22,727 కోట్లకు చేరింది. ఈ త్రైమాసికం(2022 జనవరి-మార్చి)లో అప్పు 3.74 శాతం పెరిగింది. మోదీ ప్రభుత్వం గద్దెనెక్కిన నాటికి దేశ అప్పు రూ.63,03,914 కోట్లు ఉండగా, ఈ ఏడేళ్లలో మోదీ పాలనలో దేశం అప్పు 111.34 శాతం పెరిగింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్ నివేదిక స్పష్టం చేసింది. మొత్తం అప్పులో విదేశీ అప్పు రూ.8,32,409 కోట్లు కాగా, అంతర్గత అప్పు రూ.1,14,62,343 కోట్లు (86.03 శాతం) అని పేర్కొంది. అంతర్గత రుణ భారంలో 70.02 శాతం (80.26 లక్షల కోట్లు) వాటా మార్కెట్ రుణాలదే ఉంది. చిన్న పొదుపు మొత్తాలను చూపి తీసుకున్న రుణాలు రూ.18,83,921 కోట్ల మేర ఉన్నాయి. ఈ రుణం గత మూడు నెలల్లో 15.42 శాతానికి పెరిగింది. 2021 డిసెంబర్ నాటికి దేశ అప్పు రూ.1,28,41,996 కోట్లు ఉండగా, కేవలం మూడు నెలల్లో రూ.4,80,731 కోట్ల (3.74 శాతం) మేర అప్పు పెరిగింది. డిసెంబర్ 2021 చివరి నాటికి మొత్తం బకాయి రుణాలలో 91.60 శాతం ప్రభుత్వం అప్పు ఉండగా, 2022 మార్చి చివరి నాటికి 92.28 శాతానికి పెరిగింది. 2021 డిసెంబర్ చివరి నాటికి ఒక సంవత్సరం నుంచి ఐదు సంవత్సరాలలోపు మెచ్యూర్ అయ్యే రుణాల నిష్పత్తి 24.50 శాతం కాగా, మార్చి త్రైమాసికంలో 25.43 శాతానికి పెరిగాయి.

తగ్గిన విదేశీ పెట్టుబడులు

2021-22లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ప్రవాహం తగ్గింది. 2021 ఏప్రిల్-మార్చిలో 43,955 మిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా, 2022 ఏప్రిల్-మార్చిలో 39,290 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని నివేదిక తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కేంద్రం రూ.1.37 లక్షల కోట్ల విలువైన డేటెడ్ సెక్యూరిటీలను సేకరించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.3.20 లక్షల కోట్ల విలువైన

- మిగతా 2 లో

విజయవాడ బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద ధర్నాలో రామకృష్ణ, మధు, దోనేపూడి, బాబూరావు, కాశీనాథ్, రాము తదితరులు

నిరసన జ్వాల

ఆర్టీసీ చార్జీల పెంపుపై మండిపాటు

- రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ధర్నాలు, ప్రదర్శనలు
- ప్రభుత్వంలో విలీనం చార్జీలు పెంచడానికా?
- చార్జీలు తగ్గించే వరకు పోరాడతాం
- రాష్ట్ర బంద్‌కూ వెనుకాడం: విజయవాడ ధర్నాలో రామకృష్ణ, మధు హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆర్టీసీ చార్జీల పెంపుపై ప్రజాగ్రహం పెల్లుబుకింది. ఆర్టీసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ ప్రభుత్వం మూడేళ్లలో మూడుసార్లు బస్సు చార్జీలు పెంచడంపై శనివారం వామపక్షాల అధ్వర్యాన జరిగిన ఆందోళనల్లో ప్రజలు పార్టీలకతీతంగా పెద్దసంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. విజయవాడ బస్టాండ్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ తక్షణమే పెంచిన ఆర్టీసీ చార్జీలు తగ్గించాలని, లేకపోతే అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకొని రాష్ట్రబంద్ చేస్తామని హెచ్చరించారు. చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష పార్టీల అధ్వర్యాన శనివారం ఉదయం సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఎం సిటీ కో-ఆర్డినేటర్ డి.కాశీనాథ్ అధ్యక్షతన విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద నిరసనధర్నా నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు ఆర్టీసీ చార్జీలు పెంచాయని, అయితే వైసీపీ ప్రభుత్వం తరహాలో ఇంత భారీగా ఎన్నడూ పెంచలేదన్నారు. రెండున్నర నెలల కిందట డీజిల్ సెస్ పేరుతో చార్జీలు పెంచి రూ.720 కోట్ల భారం మోపిన ప్రభుత్వం.. మళ్లీ ఇప్పుడు మరో రూ.600

- మిగతా 2 లో

తెలంగాణపై కీలక ప్రకటన చేస్తాం

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళతాం: వసుంధర రాజే వెల్లడి

మోదీకి తమిళిసై, తలసాని ఘనస్వాగతం
బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం
2 లో



కెమిస్టు హత్య

- ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- నూపుర్‌కి మద్దతుగా పోస్టు చేసినందుకేనని ఆరోపణలు
- ఉదయ్‌పూర్ దర్జీ హత్యకు వారం ముందే ఘటన
- కేసు ఎన్ఐఏకి అప్పగింత

నాగపూర్: మహారాష్ట్రలోని అమరావతి నగరంలో ఔషధ దుకాణం యజమాని (54)ని దుండగులు కత్తితో పొడిచి చంపారు. దేశవ్యాప్తంగా నిరసనలు,

- మిగతా 2 లో

అన్ని బ్యాంకులు ప్రైవేటు...?

- పీఎస్‌యూ బ్యాంకుల్లో పూర్తి వాటా విక్రయానికి కేంద్రం సన్నద్ధం
- పూర్తిస్థాయి ప్రైవేటీకరణకు మోదీ ప్రభుత్వం కసరత్తు
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బిల్లుకు యోచన

న్యూఢిల్లీ : దేశ సంపదను అప్పనంగా అమ్మేసేందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ సకల యత్నాలు చేస్తోంది. ఎన్నో కార్మిక పోరాటాలు, ప్రజల త్యాగాల ఫలితంగా సాధించుకున్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి యధేచ్ఛగా కార్పొరేట్‌ల పరం చేసేందుకు ముమ్మర కసరత్తు చేపట్టింది. ఇప్పటికే అనేక పీఎస్‌యూలను అమ్మేసిన ప్రభుత్వం తన పాలనలో మరిన్ని దుందుడుకు, ప్రజా, కార్మిక వ్యతిరేక చర్యలకు శ్రీకారం చుట్టింది. అడ్డూఅదుపు లేని ఏకపక్ష నిర్ణయాలతో ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వరంగ బ్యాంకులను వంద శాతం ప్రైవేటీకరించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బిల్లుకు యోచన చేస్తోంది.

కేంద్రం ఇప్పటికే ఉన్న జాతీయ బ్యాంకులను విలీనం చేసి రెండంకెలకు కుదించేసింది. తాజాగా ఆ బ్యాంకుల నిర్వహణ బాధ్యతల నుంచి బీజేపీ ప్రభుత్వం తప్పుకోవాలనుకుంటోంది. ఇందులో భాగంగా ఐడీబీఐ బ్యాంక్‌లో వాటాను విక్రయించేందుకు కసరత్తు చేస్తోంది. పీఎస్‌యూ బ్యాంకుల్లో తన పూర్తి వాటాను విక్రయించేందుకు చురుగ్గా వ్యవహరిస్తోంది. ఇటీవలే ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించింది. భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) లో 3.5 శాతం వాటాను విక్రయించారు. ఇప్పుడు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వంద శాతం వాటాను ప్రైవేటు సంస్థలకు విక్రయించడానికి, అనుమతించడానికి ప్రభుత్వం బిల్లును పార్లమెంట్‌లో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

దేశరక్షణ కోసం యుద్ధం

- ఇది వ్యక్తుల మధ్య పోరాటం కాదు
- విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా
- ఆత్మప్రబోధానుసారం ఓటేయండి సీఎం కేసీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశంలో రోజురోజుకు పరిస్థితులు దిగజారిపోతుంటే చూస్తూ ఉండలేమని, అందుకే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చాలా రోజులుగా పోరాటాలు చేస్తున్నామని విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా అన్నారు. రాష్ట్రపతి ఎన్నికలు ఇద్దరు వ్యక్తుల మధ్య పోరాటమో లేదా ఇద్దరి గుర్తింపు కోసమో జరిగే పోరాటం కాదని, విశాల భారత పరిరక్షణ కోసమని పేర్కొన్నారు. ఒక వ్యక్తి చెబితే దేశం మొత్తం వినడం ఎక్కడి ప్రజాస్వామ్యమని సిన్హా ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్ వచ్చిన సిన్హాకు విమానాశ్రయంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి భారీ బైక్ ర్యాలీ ద్వారా నగరంలోని జలవిహార్‌కు చేరుకొని అక్కడ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. యశ్వంత్ సిన్హా మాట్లాడుతూ రాష్ట్రపతి ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తున్నందుకు సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్‌కు ధన్యావాదాలు తెలిపారు. కేసీఆర్ మాట్లాడుతూ రాష్ట్రపతి ఎన్నికల్లో ఎలక్టోరల్ సభ్యులంతా ఆత్మప్రభోదానుసారం

- మిగతా 2 లో

విశాలాంధ్ర
ప్రపంచం
2
ఆదివారం
03 జులై 2022

స్వీయ సంస్కరణలతో దీర్ఘకాల పాలన

జిన్‌పింగ్ అభిభాషణ

బీజింగ్ : 96 మిలియన్లకు పైగా సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద పాలక కమ్యూనిస్ట్ పార్టీ చరిత్రలో అనేక ప్రభుత్వాల ఉన్నతి, పతనం చూశాయని కమ్యూనిస్టు పాలన దీర్ఘకాలం కొనసాగుతుందని అన్నారు. స్వీయ సంస్క రణలు అమలులో నాయంయబద్ధతను గత నవంబరులో రూపొందిం చింది. గత శతాబ్ది నుంచి పార్టీ ఆకాంక్షలను సాధించామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. చైనా కమ్యూనిస్టు సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కూడా జిన్‌పింగ్ పనిచేస్తున్నారు. 18వ సీపీసీ జాతీయ కాంగ్రెస్‌లో స్వీయ సంస్కరణలుగా అమలవుతాయన్నారు. ప్రధానంగా పార్టీని విప్లవాత్మక ధోరణిలో నడిపించినట్లు క్సిన్‌పింగ్ పేర్కొన్నారు, పార్టీని స్వీయ-సంస్కరణల దిశగా నూతన స్థాయికి తీసుకువెళ్లామని అన్నారు. ఆధునిక దేశాల పతనానికి ప్రాథమిక కారణం వారి స్వంత సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యంగా జిన్‌పింగ్ పేర్కొన్నారు. పార్టీ నిర్మాణాన్ని ఒక గొప్ప ప్రాజెక్ట్‌గా జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఒక శతాబ్దకాలంలో ప్రపంచంలో కనపడని మార్పులు తీవ్రమైన పరీక్షల నేపథ్యంలో చైనా కమ్యూనిస్టులు దృఢమైన చర్యలు తీసుకోవడం ద్వారా పార్టీ, దేశం, సైన్యంలో తీవ్రమైన ప్రమాదాలను రూపుమాపామన్నారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలను పెంపొందించామని ప్రజల హృదయపూర్వక మద్దతు, పార్టీ సంఘీభావం పార్టీ ప్రగతికి మార్గదర్శకంగా పేర్కొన్నారు. గత శతాబ్దంలో సీపీసీ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయడం, ప్రజల పర్యవేక్షణను అంగీకరించడం, పార్టీ శ్రేయస్సు, నిరంతర అభివృద్ధిని సాధించినట్లు జిన్‌పింగ్ పేర్కొన్నారు. పార్టీ సభ్యుల కోసం బహుళ విద్యా కార్యక్రమాలను కూడా నిర్వహించింది. పార్టీ స్వీయ సంస్కరణను నిర్వహించడానికి సైద్ధాంతిక మద్దతును జిన్‌పింగ్ ప్రోత్సహించారు.

శ్రీలంకలో పరిస్థితి దయనీయమైన స్థితికి చేరుకుంది. పెట్రోల్ కావాలంటే ముందు టోకెన్లు తీసుకోవాలి. గంటల తరబడి కాదు.. రోజుల తరబడి క్యూలో ఎదురు చూడాలి. శ్రీలంకలో పెట్రో అమ్మకాలపై ప్రభుత్వమే ఆంక్షలు విధిస్తోంది. అమ్మకాలను దగ్గరుండి పర్యవేక్షిస్తోంది. గత పదిహేను రోజులుగా ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

తెలంగాణపై కీలక ప్రకటన చేస్తాం

విశాలాంధ్ర-హైదరాబాద్: బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరంద్రమోదీ హైదరాబాద్‌కు వచ్చారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి శనివారం మధ్యాహ్నం 3గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో హెచ్‌ఐసీసీకి వెళ్లారు. ప్రొటోకాల్ ప్రకారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రధానికి స్వాగతం పలికారు. బేగంపేట విమానాశ్రయం నుంచి హెచ్‌ఐసీసీకి మోదీ బయలుదేరే వరకు మంత్రి తలసాని అక్కడే ఉన్నారు. హెచ్‌ఐసీసీలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇవి ఆదివారం కూడా కొనసాగుతున్నాయి. సమావేశాలకు నరేంద్రమోదీతో పాటు కేంద్రహోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రులు హాజరయ్యారు. మోదీ జ్యోతి ప్రజల్వనతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. గరీబ్ కల్యాణ్ అభియాన్ ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చే అంశంపై సమావేశంలో చర్చించినట్లు బీజేపీ నేత, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే తెలిపారు. వసుంధర రాజే మీడియాతో మాట్లాడుతూ అనేక అంశాలపై రెండు గంటలపాటు ప్రాథమిక చర్చలు జరిగినట్లు వెల్లడించారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోవడంపై సమావేశంలో చర్చించామన్నారు. సంపర్క్ అభియాన్ ద్వారా ప్రజల మన్ కీ బాత్ తెలుసుకునే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. గరీబ్ కల్యాణ్ అభియాన్ ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరే అంశం గురించి చర్చించామని, కొన్ని రాజకీయ తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణపైనా కీలక ప్రకటన చేయాలనే నిర్ణయానికి వచ్చామని, పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఎన్నికల బూత్‌లో కనీసం 200 మంది క్రియాశీల కార్యకర్తలు ఉండాలని, నేతల మధ్య మరింత సమన్వయం కోసం వాట్సాప్ గ్రూప్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పార్టీకి బలమైన పునాది నిర్మించాలనే అవగాహనకు వచ్చామన్నారు. బూత్‌స్థాయి బలోపేతంపై రాష్ట్ర అధ్యక్షులు, ఇతర నేతలు 15 రోజులకు ఒకసారి సమీక్ష చేస్తారని, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' చేపడతామన్నారు. దీనిద్వారా 20 కోట్ల మంది ప్రజలను ఇందులో భాగస్వాములను చేయాలని భావిస్తున్నామని, ఇదొక ఉద్యమం కానుందని అమె వ్యాఖ్యానించారు.

48వ గ్రీకు యువజనోత్సవాలు

ఏథెన్స్ : 48వ కేమ్యూనిస్టు యూత్ ఆఫ్ గ్రీస్ (కేఎన్ఈ) ఉత్సవాలు సెప్టెంబర్ 22, 23,24 తేదీలలో ఏథెన్స్‌లో జరగనున్నాయి. జులై, ఆగస్టులో గ్రీస్‌లోని అనేక నగరాలు, పట్టణాలు రాజకీయ, సాంస్కతిక ఉత్సవాల్లో మునిగిఉంటుంది. గ్రీకు కమ్యూనిస్టు హీరో నికోస్ బెలోయనిస్‌పై ఉరిశిక్ష అమలుచేసి 70 సంవత్సరాల సందర్భంగా ఈ యువజనోత్సవం ప్రేరణ పొందినట్లుగా కేఎన్ఈ పేర్కొంది. 24వ తేదీ జరగనున్న ప్రధాన కార్యక్రమంలో కేకేఈ జనరల్ సెక్రటరీ కౌట్సంబస్, కార్యదర్శి అబాటిలోస్ ప్రసంగిస్తారు. ప్రముఖ దిగ్గజ గాయకులు మరియా ఫరంటూరి, జార్జ్ దలారస్‌లతో సహా 70 మందికి పైగా ప్రముఖ కళాకారులు ఫెస్టివల్‌లో పాల్గొంటారు. అత్యంత ముఖ్యమైన వార్షిక సాంస్కృతిక కార్యక్రమాలలో భాంగా 48 సంవత్సరాల గ్రీస్ కమ్యూనిస్ట్ యూత్ చరిత్రపై ప్రదర్శన ఉంటుంది.

ఇరాన్‌లో భూకంపం..

టెహ్రాన్: ఇరాన్ భూకంపంతో వణికింది. శనివారం తెల్లవారుజామున దక్షిణ ఇరాన్‌లో రిక్టర్ స్కేల్‌పై 6.0తో భూకంపం సంభవించింది. హెర్మోజ్ ప్రావిన్స్‌లోని బందర్ అబ్బాస్ నగరానికి నైరుతి దిశలో 100 కిలోమీటర్ల దూరంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైంది. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం భూకంపం కారణంగా 49 మంది గాయపడగా, ఐదుగురు మరణించినట్లు తెలుస్తోంది. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. యూఏఈలో, ఏడు ఎమిరేట్స్‌లోనూ స్వల్ప ప్రకంపనలు సంభవించాయని యూఏఈ నేషనల్ సెంటర్ ఆఫ్ మెటియోరాలజీ తెలిపింది. అయితే ఈ ప్రాంతాల్లో ఎలాంటి నష్టం చూపించలేదని యూఏఈ తెలిపింది. అర్ధరాత్రి నుంచి శనివారం వేకువ ఝామున వరకు చాలాసార్లు ప్రకంపనలు సంభవించాయి . రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రతలు 4.6, 4.4, ఆపై 6.0, 6.3గా నమోదైంది.

కెమిస్టు హత్య

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచ ఖండనలకు దారితీసిన మహమ్మద్ ప్రవక్తపై నూపుర్ శర్మ చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా బాధితుడు సామాజిక మాధ్యమంలో ఒక పోస్టును షేర్ చేసినందున నిందితులు ఈ నేరానికి పాల్పడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఔషధ దుకాణం యజమాని ఉమేష్ ప్రహ్లాద రావు కోల్హే జూన్ 21న హత్యకు గురయ్యారని, దీనికి సంబంధించి ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేసినట్లు అధికారి తెలిపారు. ఇస్లాం మతాన్ని అవమానించినందుకు ప్రతీకారం తీర్చుకుంటున్నామని చెబుతూ ఆన్‌లైన్‌లో వీడియోలను పోస్ట్ చేయడానికి ముందు రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో దర్జీగా పని చేస్తున్న కన్హయ్య లాల్‌ను ఇద్దరు వ్యక్తులు దర్జీని గొడ్డలితో హతమార్చడానికి వారం ముందు ఈ సంఘటన జరిగింది. ఈ ఔషధ దుకాణం యజమాని హత్యకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేశామని, ఎన్జీవోను నడుపుతున్న ప్రధాన నిందితుడు ఇర్ఫాన్ ఖాన్ (32) కోసం అన్వేషణ కొనసాగుతోందని అమరావతి పోలీస్ కమిషనర్ డాక్టర్ ఆర్తీ సింగ్ శనివారం తెలిపారు. 'అమరావతి నగరంలో కోల్హే ఔషధ దుకాణం నడుపుతున్నాడు. నూపుర్ శర్మ చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో ఓ పోస్టును షేర్ చేశాడు. అతను తన వినియోగదారులతో సహా కొంతమంది ముస్లింలు కూడా సభ్యులుగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో పోస్టును పొరపాటుగా షేర్ చేశాడు' అని సిటీ కొత్వాలి పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత, కోల్హేను హత్య చేయడానికి ఇర్ఫాన్ ఖాన్ కుట్ర పన్నాడు. దాని కోసం ఐదుగురు వ్యక్తులను నియమించాడు. వారికి రూ.10వేలు ఇస్తానని, కారులో సురక్షితంగా తప్పిస్తానని హామీ ఇచ్చాడని తెలిపారు. జూన్ 21న రాత్రి 10 గంటల నుంచి 10.30 గంటల మధ్య ఈ ఘటన చోటుచేసుకుందని, తన దుకాణం మూసి ద్విచక్ర వాహనంపై కొల్హే ఇంటికి వెళుతుండగా, తనతో పాటు తన కుమారుడు సంకేత్ (27), భార్య వైష్ణవి వేరే వాహనంపై వెళుతున్నారని వివరించారు. 'అందరూ మహిళా కాలేజీ గేటు దగ్గరకు చేరుకున్నప్పుడు మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి కోల్హేను అడ్డుకున్నారు. ఓ యువకుడు మోటార్ సైకిల్‌పై నుంచి దిగి పదునైన ఆయుధంతో కోల్హే మెడపై పొడిచి ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. కోల్హే రక్తపు మడుగులో రోడ్డుపై కుప్పకూలిపోయాడు. సంకేత్ అతన్ని ఆస్పత్రికి తరలించగా, అక్కడ అతను మరణించాడు' అని పోలీసు అధికారి తెలిపారు. సాకేత్ ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐదుగురు వ్యక్తులను ముద్దసిర్ అహ్మద్ (22), షారుక్ పఠాన్ (25), అబ్దుల్ తౌఫీక్ (24) షోయబ్ ఖాన్ (22), అతిబ్ రషీద్ (22)గా గుర్తించారు. అరెస్టయిన వారందరూ అమరావతిలో నివసించే రోజువారీ కూలీలు. పోలీసులు నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సంఘటనల క్రమాన్ని సంగ్రహించిన సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. హత్యకు గల కారణాలను తెలుసుకుంటున్నామని పోలీసు కమిషనర్ సింగ్ తెలిపారు. మహమ్మద్ ప్రవక్తపై చేసిన ఆరోపణతో భారతదేశం, గల్ఫ్ దేశాలలో ఆగ్రహానికి దారితీసినందుకు బీజేపీ తన జాతీయ అధికార ప్రతినిధి నూపుర్ శర్మను జూన్ 5న సస్పెండ్ చేసింది. ఢిల్లీ బీజేపీ మీడియా హెడ్ జిందాల్‌ను బహిష్కరించింది.

దర్యాప్తు చేయనున్న ఎన్ఐఏ

అమరావతిలో ఔషధ దుకాణం యజమాని హత్యపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తు చేస్తుందని, సస్పెన్షన్‌కి గురైన బీజేపీ నాయకురాలు నూపుర్ శర్మకు మద్దతుగా అతని సామాజిక మాధ్యమాల పోస్టులతో ఇది ముడిపడి ఉండవచ్చని ప్రభుత్వం శనివారం తెలిపింది. ఔషధ దుకాణం యజమాని ఉమేష్ ప్రహ్లాదరావు కోల్హే జూన్ 21న హత్యకు గురయ్యాడు. కోల్హే హత్యకు సంబంధించిన కేసు దర్యాప్తును ఎన్ఐఏకి అప్పగించినట్లు హోం మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ట్వీట్ చేశారు. దర్యాప్తు సంస్థ హత్య, సంస్థల ప్రమేయం, అంతర్జాతీయ సంబంధాల వెనుక ఉన్న కుట్రను క్షుణ్ణంగా పరిశోధిస్తుంది.

రాజస్థాన్‌కి చెందిన ఉదయపూర్ దర్జీ కన్హయ్య లాల్ హత్యపై కూడా ఎన్ఐఏ విచారణ జరుపుతోంది. కాగా ఔషధ దుకాణం యజమాని హత్య కేసు విచారణ కోసం ఎన్ఐఏ బృందం శనివారం అమరావతిని సందర్శించింది. ఎన్ఐఏ బృందం అమరావతికి చేరుకుందని ముంబైలోని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఔరంగాబాద్‌కు చెందిన రాష్ట్ర పోలీసుల ఉగ్రవాద నిరోధక బృందం (ఏటీఎస్) కూడా నగరాన్ని సందర్శిస్తోందని ఒక అధికారి తెలిపారు.

అన్ని బ్యాంకులు ప్రైవేటు...?

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టేందుకు యోచిస్తోంది. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం బ్యాంకింగ్ కంపెనీల (అండర్‌టేకింగ్‌ల స్వాధీనం, బదిలీ) చట్టం-1970కి సవరణను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ప్రభుత్వ బ్యాంకుల నుంచి పూర్తిగా వైదొలగేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 18 నుంచి ఆగస్టు 12 వరకు జరగనున్నాయి.

ప్రభుత్వ వాటా తగ్గించాలని కేంద్రం ఆలోచన

బ్యాంకింగ్ చట్టం ప్రకారం ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రభుత్వం కనీసం 51 శాతం వాటాను కలిగి ఉండాలి. ముందుగా ఈ వాటాను 26 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే బిల్లును ప్రవేశపెడితే, అటువంటి బ్యాంకుల్లో 0 శాతం వాటాను కలిగి ఉండడాన్ని ఆమోదించవచ్చు. ఇటీవల ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా విక్రయానికి సంబంధించిన చర్చలు చేసింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ కూడా ప్రైవేటీకరణ చేసే వాటిల్లో ఉన్నాయి.

ప్రభుత్వ బ్యాంకుల యాజమాన్య సమస్యలపై చర్చించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తుత సంవత్సరంలో రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఒక సాధారణ బీమా సంస్థను ప్రైవేటీకరించనున్నట్లు ప్రకటించారు. ఈ బిల్లును ముందుగా 2021లో పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాల్సి ఉంది. దీనికి బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు-2021 అని పేరు పెట్టారు. అయితే దీనిని ప్రవేశపెట్టలేదు. ఇప్పుడు వంద శాతం బ్యాంకులను ప్రైవేటీకరణ చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే బిల్లు పెట్టేందుకు కసరత్తు జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

దేశరక్షణ కోసం యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఓటు వేయాలని కోరారు. ఎన్నికల సమయంలో తియ్యటి మాటలు చెప్పే ప్రధాని మోదీ ఎన్నికల తరువాత అంతా ఝూటీ ఝూటీ మాటలు చెబుతూ కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు. యశ్వంత్ సిన్హా ఉన్నత వ్యక్తిత్వం గలవారని, న్యాయవాదిగా కెరీర్‌ను ప్రారంభించిన ఆయన వివిధ హోదాల్లో దేశానికి అత్యుత్తమ సేవలందించారని కొనియాడారు. ఆర్థికమంత్రిగా పనిచేయడంతో పాటు వివిధ రంగాల్లో విశేష అనుభవముందని తెలిపారు. ఉత్తమ, ఉన్నత వ్యక్తి రాష్ట్రపతిగా ఉంటే దేశ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని చెప్పారు. మోదీ ప్రధానిగా తానే బ్రహ్మ అనుకుంటున్నారని, ఆ పదవి శాశ్వతం కాదని ఆయన గ్రహించాలని సూచించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని, రాజ్యాంగ విరుద్ధంగా తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలను కూలదోస్తున్నారని విమర్శించారు. మోదీని షావుకార్ల సేల్స్‌మన్‌గా కేసీఆర్ అభివర్ణించారు. అడ్డికి పావుసేరు ధరతో బయట నుండి బొగ్గు కొనుగోలు చేయాల్సిన అవసరం ఏముందో చెప్పాలని, సింగరేణి బొగ్గు టన్ను రూ.4వేలుకాగా, విదేశీ బొగ్గు రూ.30 వేలు ఉందని వివరించారు. మోదీ ఏ షావుకార్లకు ఏ మేరకు తినబెడుతున్నారో...ఏఏ దేశాల్లో ఆయన ఏజెంట్లు ఉన్నారో...తమవద్ద పూర్తి సమాచారం ఉందని కేసీఆర్ అన్నారు. సరైన సమయంలో వాటిన్నింటినీ బహిర్గతం చేస్తామన్నారు. అంతర్జాతీయ విపణిలో రూపాయి విలువనే ఎందుకు పడిపోతుందో ప్రజలకు బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కరోనాను నియంత్రించడంలో విఫలమైన మోదీ లక్షలాది మంది శవాలను పవిత్రగంగలో కలిపారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహారాష్ట్ర తరహాలో తెలంగాణ ప్రభుత్వాన్ని కూలుస్తామని బీజేపి నాయకులు అంటున్నారని, దమ్ముంటే వచ్చి తన ప్రభుత్వాన్ని కూల్చాలని సవాల్ చేశారు. రాష్ట్రాలకు సంబంధించిన రూ.30లక్షల కోట్లు తన్నుకుపోయారని, చివరకు మహాత్మాగాంధీని అవమానించి భారతదేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో దిగజార్చారని విమర్శించారు. దేశానికి సాగు, తాగునీరు, విద్యుత్ ఇవ్వలేకపోయారని, కనీసం ఢిల్లీలోనూ తాగునీరు అందించలేకపోయారని ఆరోపించారు. ఉద్యమాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, అందుకే రాష్ట్రపతి ఎన్నికల్లో యశ్వంత్‌సిన్హాకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ వస్తున్న మోదీ..తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా మోదీ నెరవేర్చలేదన్నారు. డీజిల్ సహా అన్ని ధరలు కేంద్రం పెంచేసిందని కేసీఆర్ మండిపడ్డారు. ఇవి చాలదన్నట్లు నల్లచట్టాలు తెచ్చి రైతులను ఇబ్బందిపెట్టిందని మండిపడ్డారు. ఉద్యమంలో కొందరు రైతులు మృతిచెందారని, వారి కుటుంబాలకు తాము రూ.3 లక్షలు చొప్పున ఇస్తే, బీజేపీ తమను చులకనగా చూసిందని సీఎం మండిపడ్డారు. మోదీ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, మోదీ తీరుతో శ్రీలంకలో ప్రజలు నిరసనలు తెలిపారని గుర్తుచేశారు. శ్రీలంక ఆరోపణలపై ప్రధాని మౌనమెందుకు వహిస్తున్నారని నిలదీశారు. శ్రీలంక విషయంలో స్పందించకుంటే మోదీని దోషిగానే చూడాల్సి వస్తుందన్నారు. మోదీ అవినీతిరహిత భారత్ అని పెద్దపెద్ద మాటలు చెప్పారని, ఎంత నల్లధనం వెనక్కి తీసుకొచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ పాలనలో అవినీతిపరులు పెరిగిపోయారన్నారు.

మోదీ విధానాల కారణంగా పెద్దపెద్ద పరిశ్రమలు పారిపోతున్నాయని విమర్శించారు. ఎనిమిదేళ్లలో దేశంలో భారీ కుంభకోణాలు జరిగాయని, రూపాయి పతనం చూస్తే మోదీ పాలన అర్థమవుతోందన్నారు. మేక్ ఇండియా అనేది శుద్ధ అబద్ధమని, తనకు మోదీతో ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవని, మోదీ విధానాలతోనే తమ అభ్యంతరమని పేర్కొన్నారు. ఇకముందు తాము మౌనంగా ఉండబోమని, మరిన్ని ఉద్యమాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు.

రుణభారతం

(మొదటిపేజీ తరువాయి)

డేటెడ్ సెక్యూరిటీలను సేకరించింది. 2022 జనవరి-మార్చి త్రైమాసికంలో కేంద్ర ప్రభుత్వం నగదు నిర్వహణ బిల్లుల ద్వారా ఎలాంటి మొత్తాన్ని సేకరించలేదు. రిజర్వ్ బ్యాంక్ ఈ త్రైమాసికంలో ప్రభుత్వ సెక్యూరిటీల కోసం బహిరంగ మార్కెట్ కార్యకలాపాలను నిర్వహించలేదు. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, స్పెషల్ లిక్విడిటీ ఫెసిలిటీతో సహా లిక్విడిటీ అడ్జస్ట్‌మెంట్ ఫెసిలిటీ (ఎల్ఏఎఫ్) కింద ఆర్‌బీఐ నికర రోజువారీ సగటు లిక్విడిటీ శోషణ త్రైమాసికంలో రూ.6.44 లక్షల కోట్లుగా ఉందని నివేదిక తెలిపింది.

ఉక్రెయిన్‌కు అమెరికా 820 మిలియన్ డాలర్ల సాయం

వాషింగ్టన్ : ఉక్రెయిన్‌కు అమెరికా మరోమారు ఆర్థిక సాయాన్ని ప్రకటించింది.క్షిపణి వ్యవస్థలతో సహా 820 మిలియన్ల అమెరికా డాలర్ల సహాయాన్ని వైట్‌హౌస్ ప్రకటించింది. రష్యా దీర్ఘ-శ్రేణి దాడులకు ప్రతిస్పందనగా ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థలు, కౌంటర్-ఆర్టిలరీ రాడార్‌లతో సహా ఉక్రెయిన్‌కు 820 మిలియన్ డాలర్ల సైనిక సహాయాన్ని అందించనున్నట్లు ప్రకటించింది. ఉక్రెయిన్ మిత్ర దేశాలకు అధునాతన క్షిపణి వ్యవస్థలను త్వరగా పంపాలని బహిరంగంగా పిలుపునిచ్చింది. ఇప్పటివరకు 7బిలియన్ డాలర్ల సైనిక సహాయాన్ని పంపినట్లు అమెరికా పేర్కొంది. 8.8 బిలియన్ డాలర్ల ఆయుధాలు, సైనిక శిక్షణకు కూడా కట్టుబడిఉన్నట్లు తెలిపింది.

నిరసన జ్వాల

(మొదటిపేజీ తరువాయి)

కోట్ల వసూలు కోసం భారీగా పెంచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామీణ ప్రజలు ఎక్కువగా ప్రయాణించే పల్లెవెలుగు బస్సు చార్జీలను కూడా 62 శాతం పెంచడానికి ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది చార్జీలు పెంచుకోవడానికి అన్నట్లుగా వైసీపీ సర్కారు వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు భారీగా పెంచారని, మళ్లీ ఆగస్టు ఒకటో తేదీ నుంచి ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.3వేల కోట్ల వసూలుకు రంగం సిద్ధమైందని చెప్పారు. పొరుగు రాష్ట్రాల కన్నా ఆంధ్రాలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇనుము, ఇసుక, సిమెంట్ సహా అన్ని ధరలు అధికమని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఒకవైపు ప్రజలపై పదేపదే భారాలు మోపుతూ...మరోవైపు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేస్తోందని మండిపడ్డారు. పి.మధు మాట్లాడుతూ కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని పక్కన పెట్టి సెస్‌ల పేరుతో ప్రజలపై భారం మోపుతోందని, సెస్‌లో వాటా రాష్ట్రాలకు రాదని తెలిపారు. సెస్‌ల రూపంలో వసూలు చేసిన సొమ్ములో వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేయకుండా మళ్లీ ప్రజలపై భారాలు మోపడం దుర్మార్గమన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలు బాగాలేవని, వెంటనే వారు దిగిపోవాలని, తాము గద్దె నెక్కాలని ఆరాట పడుతున్న టీడీపీ, జనసేన..ప్రజా సమస్యలపై పోరాటం చేయడం లేదన్నారు. వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీకి అనుకూలంగానే ఉన్నాయని విమర్శించారు. సీపీఐ ఎంఎల్(న్యూడెమోక్రసీ) నాయకుడు పోలారి, సీపీఐ ఎంఎల్ నాయకులు లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రం జీఎస్టీ పేరుతో మజ్జిగ, అప్పడాలపైనా పన్నులు వేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని చార్జీలు, పన్నులు పెంచి వేధిస్తోందన్నారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు సీహెచ్ బాబూరావు, సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష పార్టీల, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బస్సు చార్జీలు తగ్గించాలని నినాదాలు చేశారు.

తిరుపతిలో

ప్రజలకు భారం కానున్న బస్సు చార్జీలు రద్దు చేయకపోతే ముఖ్యమంత్రి జగన్‌కి తగిన బుద్ధి చెపుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి హరినాథరెడ్డి హెచ్చరించారు. తిరుపతిలో సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుండి ఆర్టీసీ బస్సు డిపో వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, నగర కార్యవర్గ సభ్యులు బి.నదియ, ఎన్.శ్రీరాములు, ఎన్‌డీ రవి, ఎం.రామకృష్ణ, కేవై రాజా, సీహెచ్ శివకుమార్, శశి కుమార్, మహేంద్ర, సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నాయకులు జయచంద్ర, శీను, సాయిలక్ష్మీ, రాధ, ఆర్.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న హరినాథరెడ్డి, పెంచలయ్య, మురళీ, విశ్వనాథ్ తదితరులు

కడపలో మీడియాతో మాట్లాడుతున్న ఈశ్వరయ్య, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, వెంకటశివ, శ్రీకృష్ణ తదితరులు

కడపలో

జగన్ ప్రభుత్వం ఆర్భాట ప్రచార ఖర్చులు తగ్గించుకోకుండా రెండున్నర నెలల్లో రెండవసారి ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపడం దారుణమని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, ఏ.చంద్రశేఖర్ మండిపడ్డారు. డీజిల్ సెస్ పేరుతో ఆర్టీసీ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ కడప ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీపీఐ, సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిరసన అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లోకి దూసుకెళ్లడానికి ప్రయత్నించిన వెంకట శివ, చంద్ర, చంద్రశేఖర్, మల్లికార్జునలను అరెస్టు చేసి చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సీపీఐ నగర కార్యదర్శి యస్.వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కృష్ణమూర్తి, ఎల్.నాగసుబ్బారెడ్డి, సి.సుబ్రహ్మణ్యం, జి.చంద్ర, పి.చంద్రశేఖర్, కేసీ బాదుల్లా, జి.మద్దిలేటి, సీపీఎం నాయకులు రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, అన్వేష్, లోక్‌సత్తా నాయకులు శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో

ఆర్టీసీ చార్జీల పెంపుపై ఉమ్మడి గుంటూరు జిల్లా(గుంటూరు, పల్నాడు, బాపట్ల)లో నిరసనలు హోరెత్తాయి. గుంటూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొనగా, పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన నిరసనలో పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, బాపట్ల జిల్లా రేపల్లెలో జరిగిన నిరసనలలో బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి పి.నాగాంజనేయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో

ఆర్టీసీ చార్జీల పెంపుపై ఇబ్రహీంపట్నం బస్‌డిపో వద్ద ధర్నా చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుద్ధి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో

బస్సు చార్జీలను నిరసిస్తూ ప్రకాశం జిల్లాలో నిరసనలు వెల్లువెత్తాయి. వామపక్షాలతో పాటు తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలోనూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఒంగోలులో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ అధ్వర్యంలో ధర్నా చేశారు. తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలోనూ ఒంగోలుతో పాటు పర్చూరు, మార్కాపురం, కందుకూరు తదితర ప్రాంతాల్లో నిరసనలు కొనసాగాయి. ఒంగోలులో సీపీఐ జిల్లా నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావుతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు పీవీఆర్ చౌదరి, కొత్తకోట వెంకటేశ్వర్లు, కె.నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు కొండారెడ్డి, ఆంజనేయులు, సీపీఐ న్యూడెమోక్రసీ నాయకులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో

ఏలూరు జిల్లాలో వామపక్షాల అధ్వర్యంలో నిరసనలు జరిగాయి. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ కొయ్యలగూడెంలో చార్జీల పెంపునకు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. ఏలూరు జిల్లా ప్రధాన కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు వామపక్షాలతో కలిసి ధర్నా నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో సీపీఐ మండల కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కామవరపు కోటలో టీవీఎస్ రాజు, కుక్కునూరులో సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, చింతలపూడిలో సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తుర్లపాటి బాబు, నూజివీడులో సీపీఐ పట్టణ కార్యదర్శి సీహెచ్ పుల్లారావు, భీమవరంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్వర్యంలో, ఉండిలో సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకటరావు అధ్వర్యంలో వామపక్షాలతో కలిసి బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు.

కర్నూలులో

పెంచిన బస్సు చార్జీలు తగ్గించాలని వామపక్షపార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్షపార్టీలు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆర్టీసీ బస్టాండ్ల వద్ద ఎదుట, రోడ్లపై బస్సులు నిలిపివేసి నిరసన తెలిపాయి. కర్నూలు, నంద్యాల, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, నందికొట్కూరు, బనగానపల్లెలో ఆందోళనలు నిర్వహించారు.

విశాఖలో

బస్ చార్జీలు తక్షణమే తగ్గించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో నేతలు నిరసనలు తెలిపారు. విశాఖలోని ద్వారకా బస్టాండ్ వద్ద సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు నేతృత్వంలో రాస్తారోకో నిర్వహించారు. నర్సీపట్నంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

అనకాపల్లి జిల్లాలో

అనకాపల్లిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, సీపీఎం నాయకులు బాలకృష్ణ నేతృత్వంలోనూ, చోడవరంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, కొయ్యూరులో సీపీఐ మండల కార్యదర్శి ఇరువాడ దేవుడు అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ నేతలు మాదల సత్యనారాయణ, గండేపల్లి నూకరాజు, ఉల్లి విజయ్‌కుమార్, కాకర రాంబాబు, పొటుకూరి దారమల్లేశ్, సోమెల దారమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. చోడవరంలో ఏరియా కార్యదర్శి నేమాల హరి, సహాయ కార్యదర్శి పొట్నూరు మరిడి, పి.అప్పారావు, జలగడుగుల శివ, పూర్ణ, కోడి నూకరాజు, సాయి, అనుబంధ ప్రజా సంఘాలు, మోటారు వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి, అనంత జిల్లాల్లో

బస్సుచార్జీల పెంపునకు నిరసనగా సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట నిరసన కార్యక్రమాలు జరిగాయి. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట జరిగిన ధర్నాలు సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్ మాట్లాడారు. అనంతపురం జిల్లాలోగుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ డిపోల ఎదుట ధర్నాలు చేపట్టారు. సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురం, మడకశిర డిపోల ఎదుట ధర్నాలు జరిగాయి. సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య మాట్లాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు శ్రీరాములు, లింగమయ్య, రమణ, మల్లికార్జున, సీపీఎం నాయకులు నల్లప్ప, రామిరెడ్డి, వెంకట నారాయణ, వలి, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఎస్‌యూసీఐ నగర కార్యదర్శి తబ్రేజ్, పట్టణ పేదల సంఘం అధ్యక్షుడు వీర నారప్ప తదితరులు పాల్గొన్నారు.

'మణిపాల్'లో విజయవంతంగా

కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు

విశాలాంధ్ర-విజయవాడ : కేవలం 48 గంటల వ్యవధిలో తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్లో విజయవంతంగా మూడు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు చేశారు. శస్త్రచికిత్సలపై మణిపాల్ హాస్పిటల్స్ లివర్ స్పెషలిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, హైదరాబాద్‌లోని సౌత్ ఆసియన్ లివర్ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్, అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌ప్లాంట్ ఫెలోషిప్ (లండన్) పొందిన ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ మాట్లాడుతూ మణిపాల్ హాస్పిటల్స్ సౌత్ ఆసియన్ లివర్ ఇన్‌స్టిట్యూట్ మధ్య ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో రోగులకు తగిన ప్రయోజనాన్ని అందించిందన్నారు. కేవలం రెండు రోజుల వ్యవధిలో విజయవంతంగా మూడు అత్యంత క్లిష్టమైన కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేశామన్నారు. అవయవాల కోసం నిరీక్షిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుందని, అవసరమైనన్ని అవయవాల లభ్యత మన దగ్గర లేదని, చనిపోయిన దాతలతో పాటు జీవించి ఉన్న వ్యక్తుల నుంచి అవయవాలను సేకరించి రోగులకు మెరుగైన ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు.

విదేశీ సంస్కృతితో

యువత చెడుమార్గం

మహిళా సమాఖ్య నేత విమల

విశాలాంధ్ర-విశాఖ: ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ప్రతిభ కనబరుస్తున్నారని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు విమల అన్నారు. సీపీఐ 27వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని 'మహిళల రక్షణ-సామాజిక బాధ్యత' అనే అంశంపై ఎండీ బేగం అధ్యక్షతన మాధవధారలోని సీపీఐ కార్యాలయంలో శనివారం సదస్సు జరిగింది. విమల మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన భారత్‌లో విదేశీ విషసంస్కృతి, అశ్లీలత, హింసను ప్రేరేపించే చిత్రాలు, మాదకద్రవ్యాలు, మద్యం వల్ల యువత చెడు మార్గం పడుతోందని ఆవేదన చెందారు. దేశంలో నిమిషానికి ఒక స్త్రీ హత్యాచారానికి గురవుతోందన్నారు. మహిళా సాధికారత కోసం పాటుపడుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేసుకుంటున్నాయని, కానీ వారి అభివృద్ధికి బాటలు వేయడానికి చిత్తశుద్ధితో ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. 5వ పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ దివ్యభారతి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న రుగ్మతలకు వ్యతిరేకంగా స్త్రీలు చైతన్యంతో ముందుకు కదలాలని, మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన దిశా చట్టం ప్రాముఖ్యతను మహిళలకు తెలియజేయడం కోసం, వారి రక్షణ కోసం రాష్ట్ర పోలీస్ యంత్రాంగం దీక్షతో చర్యలు చేపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ ఉత్తర నియోజకవర్గం సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణం, మహిళా కార్యకర్తలు నూకాలమ్మ, దేవుడమ్మ, కల్యాణి, సత్యవతి, వెంకటలక్ష్మి, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నిరసనాగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ చార్జీల పెంపును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మండల స్థాయిలో జరిగే రెండు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, మచిలీపట్నం, నరసరావు పేట, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, రాజంపేట, కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల పార్లమెంట్ల పరిధిలోని 388 మండలాల్లో టీడీపీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అదనపు చార్జీలతో ప్రజలపై పడే ఆర్థిక భారాలను వివరిస్తూ ప్రయాణికు లకు కరపత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న బాదుడే-బాదుడు గురించి ప్రయాణికులకు వివరించారు. ఆర్టీసీ బస్టాండ్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. చార్జీలు తగ్గించే వరకూ ప్రభుత్వంపై టీడీపీ పోరాటం చేస్తుందని నేతలు ప్రకటించారు. అడుగడునా బాదుడే-బాదుడు అంటూ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఓ వైపు నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీల పెంపు, మరోవైపు చెత్తపై పన్ను వేసి రికార్డు సృష్టించిన జగన్‌మోహన్ రెడ్డి మూడేళ్లలో మూడుసార్లు ఆర్టీసీ చార్జీలు పెంచి తన రికార్డును తానే బ్రేక్ చేసుకున్నారని ధ్వజమెత్తారు. మూడేళ్ల అరాచక పాలనలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేసిన జగన్‌మోహన్ రెడ్డి..దాన్ని లూటీ చేసి ప్రజలను చార్జీలతో బాదడం దుర్మార్గమన్నారు. పల్లె వెలుగు బస్సులు మొదలు ఏసీ బసుల దాకా అన్నింటిపై చార్జీలు బాదేశారన్నారు. తాజా చార్జీల పెంపుతో ప్రజలపై రూ.3వేల కోట్ల భారం పడుతున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ఆర్టీసీ చార్జీలు ఎప్పుడూ పెంచలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనమని ఉద్యోగులకు కనీస సదపాయాలు కల్పించకుండా మోసం చేశారన్నారు. ఆర్టీసీ ఆస్తులు కొట్టేయటానికి వైసీపీ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని ధ్వజమెత్తారు. నిరసన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు బెందళం అశోక్, నిమ్మల రామానాయుడు, పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, బుద్దా నాగ జగదీశ్, కొనకళ్ల నారాయణ, లింగారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గొల్లా నరసింహ యాదవ్, పులివర్తి నాని, ఎమ్మెల్సీలు బచ్చుల అర్జునుడు, దొరబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జులు గండి బాబ్జి, కోరాడ రాజాబాబు, కలమట వెంకటరమణ, బగ్గు రమణ మూర్తి, పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, ప్రగాడ నాగేశ్వరరావు, పీవీజీ కుమార్, ముప్పుడి వెంకటేశ్వరరావు, అరవింద బాబు, సుగుణమ్మ, పాశం సునీల్ కుమార్, నెలవల సుబ్రమణ్యం, అమీర్ బాబు, సుధాకర్ యాదవ్, భూపేశ్ రెడ్డి, సుబ్బారెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జయనాగేశ్వరరెడ్డి, గౌరు చరితారెడ్డి, మునిరత్నం, ప్రవీణ్ రెడ్డి, ప్రభాకర్ చౌదరి, ఉమా మహేశ్వరనాయుడు రాష్ట, నియోజకవర్గ, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

జగన్ సర్కార్‌కు మతి భ్రమించింది

అందుకే ఉడతకు పోస్టుమార్టం: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జగన్ ప్రభుత్వానికి పిచ్చి ముదిరిందని, హైటెన్షన్ వైర్లు తగిలి ఆటోతో సహా ఐదుగురు సజీవ దహనమైతే ఉడతకు పోస్టుమార్టమ్ చేయడమేంటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా, తాడిమర్రి మండలం, గుడ్డంపల్లిలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి, ఆటోతో సహా కూలీలు సజీవ దహనమైన హృదయ విదారక ఘటనలో రాష్ట్ర ప్రభుత్వాలు అవాస్తవాలు, అభూత కల్పనలు సృష్టించడం, నేరం మొత్తాన్ని ఉడత మీదకు తోసివేయడం దుర్మార్గం. ఉడత వల్లే హైటెన్షన్ వైర్లు తెగి ప్రమాదం జరిగిందని చెబుతూ, ఉడతకు పోస్టుమార్టమ్ చేయడం హాస్యాస్పదం. జగన్ రాష్ట్ర శాసనసభలోమూడు రాజధానుల ప్రకటన చేయగానే ప్రజలు నవ్వుకున్నారు. ఆనాటి నుంచి అనేక అంశాల్లో 'ఎడ్డెం అంటే తెడ్డెం' అంటూ ప్రజామోదానికి వ్యతిరేకంగా నిర్ణయాలు చేస్తూ, కోర్టుల నుంచి మొట్టికాయలు వేయించుకున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. హైటెన్షన్ వైర్లు మరమ్మతులకు నోచుకోక తెగిపడితే, ఉడత కొరకడం వల్లనే విద్యుత్ తీగలు తెగాయని చెప్పడమేంటి? అంటే విద్యుత్ హైటెన్షన్ వైర్లు ఉడత కొరికితే తెగేంత నాసిరకమైనవా? ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కుంటి సాకులు చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మొత్తంమీద జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి మతి భ్రమించినట్టు స్పష్టంగా కనపడుతోందని రామకృష్ణ విమర్శించారు.

ఆలోకం వెంకాయమ్మ స్ఫూర్తి ఆదర్శనీయం

సంస్మరణ సభలో వక్తల నివాళి

విశాలాంధ్ర-గుంటూరు: ఉత్తమ వ్యక్తిత్వం గల ఆలోకం వెంకాయమ్మ ఆశయాలు కొనసాగించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆలోకం వెంకాయమ్మ సంస్మరణ సభ గుంటూరులోని శుభం కన్వెన్షన్ హాలులో శనివారం జరిగింది. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ భర్త నుంచి అభ్యుదయ భావాలను పుణికిపుచ్చుకున్న వెంకాయమ్మ...సమాజాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఆమె ఏది తలపెట్టినా మాటలకు పరిమితం కాలేదని, చేతల్లో చూపించారని కొనియాడారు. పుట్టిన వారంతా మరణిస్తారని, మరణం తరువాత కొందరే గుర్తుంటారని, అలాంటి వారిలో వెంకాయమ్మ ఒకరని ప్రశంసించారు. ఆమె స్ఫూర్తితో సమాజాభివృద్ధికి అందరం కృషి చేయాలని కోరారు. కళ్లను, భౌతికకాయాన్ని దానం చేసిన వెంకాయమ్మ గొప్పతనాన్ని సభ కొనియాడింది. తొలుత వెంకాయమ్మ చిత్రపటానికి ప్రముఖులు, వ్యాపారవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), కళాపరిషత్ కార్యదర్శి బండ్ల పూర్ణ, సీపీఎం నాయకులు నూతలపాటి కాళిదాసు, ప్రముఖ వ్యాపారవేత్త సామినేని కోటేశ్వరరావు, ఏఎన్‌యూ మాజీ వైస్ చాన్సలర్ రావెల సాంబశివరావు, కిలారి రాజన్‌బాబు, చిట్టినేని లక్ష్మీనారాయణ, డాక్టర్ రాయపాటి మమత, ఆలోకం పెద్దబ్బయ్య, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నుంచి జూన్ వరకు

రూ.1166.69 కోట్ల ఆదాయం

- గతంకంటే 79.97 శాతం అధికం
- డీఆర్ఎం శివేంద్ర మోహన్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): విజయవాడ రైల్వే డివిజన్ ఈ అర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ.1166.69 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) శివేంద్ర మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది రూ.648.26 కోట్లు అని, గతం కంటే 79.97 శాతం అధికమని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు 13.783 మిలియన్ల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేయటం జరిగిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే 381 శాతం వృద్ధి నమోదైందన్నారు. ప్రయాణీకుల ద్వారా లభించిన ఆదాయం రూ.288.17 కోట్లు అని, ఇది గతంతో పోలిస్తే 232.72 శాతం ఎక్కువ అన్నారు. డివిజన్‌లో జూన్ వరకు 7.848 మిలియన్ టన్నుల సరకు లోడింగ్ జరిగిందని, గత సంవత్సరం 5.26 మిలియన్ టన్నులని, గతంకంటే 49.21 శాతం అధికమని వివరించారు. ఈ ఏడాది జూన్‌లో 3.00 మిలియన్ టన్నుల లోడింగ్ జరిగిందని, డివిజన్‌లో గత 13 సంవత్సరాల నుంచి సాధించిన దానికంటే అత్యధికమన్నారు. సరుకు రవాణా ఆదాయంలో చెప్పుకోదగ్గ వృద్ధిని సాధించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు రూ.852.33 కోట్లుగా నమోదయిందనీ, గత సంవత్సరంతో పోలిస్తే 54 శాతం పెరిగిందన్నారు. అనకాపల్లి, రేగుపాలెంలో కలప వ్యర్థాలను లోడ్ చేస్తున్నామని, ఇప్పటివరకు 17 రేక్‌లను లోడ్ చేయడం ద్వారా రూ.3.3 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. కృష్ణపట్నం పోర్టులో ఇనుప ఖనిజం లోడింగ్ ప్రారంభించగా ఇప్పటి వరకు 57 రేక్‌లను లోడ్ చేయడం ద్వారా రూ.22.53 కోట్ల ఆదాయాన్ని ఆర్జించామని డీఆర్ఎం శివేంద్ర మోహన్ చెప్పారు. ఫిష్ ఫీడ్ జోడించబడిన మరొక స్ట్రీమ్ ఇప్పటివరకు 3 రేక్‌లు (24 పార్సెల్ వాన్, 1 ఎస్ఎల్ఆర్) లోడ్ చేయబడ్డాయనీ, వాటి ద్వారా రూ.0.81 కోట్ల ఆదాయం లభించిందన్నారు. భవిష్యత్‌లో మౌలిక సౌకర్యాలను మరింత పెంచి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆయన చెప్పారు.

హర్షిణీ.. గర్వపడుతున్నానమ్మా!

కుమార్తెను చూసి మురిసిన జగన్ దంపతులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి జగన్ దంపతులు తమ కుమార్తెను చూసి మురిసిపోయారు. కుమార్తె వైఎస్ హర్షిణి రెడ్డి పారిస్‌లోని ప్రఖ్యాత ఇన్సీడ్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పట్టా అందుకున్నారు. డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణురాలైంది. ఈ స్నాతకోత్సవంలో తమ కుమార్తె పట్టా అందుకోవటం ప్రత్యక్షంగా చూసేందుకు జగన్, భారతి పారిస్ వెళ్లారు. శనివారం అక్కడ ఈ పట్టా ప్రదానం జరిగింది. దీంతో కుమార్తె ఎదుగుదల, మాస్టర్స్ డిగ్రీ పట్టా అందుకోవటంతో జగన్ ట్వీట్ చేశారు. అందులో కుమార్తె ప్రతిభను అభినందించారు. ఆ దేవుడి దయతో అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు.

మోదీ పర్యటనను వ్యతిరేకిద్దాం

విశాలాంధ్ర- కూర్మన్నపాలెం: స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహా విష్కరణకు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం విచ్చేస్తున్న ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నిరసనలు తెలియజేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ తీర్మానించింది. స్టీల్ ప్లాంట్ సెంట్రల్ స్టోర్ వద్ద కమిటీ సభ్యులు డి.వి.రమణారెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ప్రధాని పర్యటనపై సభ్యులు తీవ్ర నిరసన తెలిపారు. దేశ సంపద విదేశీయులు దోచుకుపోకుండా ప్రాణాలొడ్డి పోరాడిన మన్యం వీరుడు అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత దేశ సంపదను విదేశీయులకు దోచిపెడుతున్న మోదీకి లేదన్నారు.

పార్లమెంటులో అల్లూరి విగ్రహం

ఏర్పాటు చేయాలంటూ ప్రధానికి, స్పీకర్‌కు చంద్రబాబు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అల్లూరి 125వ జయంతి సందర్భంగా పార్లమెంటులో సీతారామరాజు విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి, లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లాకు ప్రతిపక్షనేత చంద్రబాబు శనివారం లేఖలు రాశారు. భారత స్వాతంత్ర్య 75వ వసంతాల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో అల్లూరి సీతారామరాజును స్మరించుకోవడం తెలుగు ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరిని చేర్చినందుకు మోదీ నాయకత్వంలోని ప్రభుత్వానికి తెలుగు ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. 2022 జులై 4న భీమవరంలో మోదీ చేయబోయే అల్లూరి విగ్రహా ఆవిష్కరణ ప్రజల మనసుల్లో గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ఈ ఏడాదే అల్లూరి సీతారామ రాజు 125వ జయంతి ఉండటం ఆనందదాయ కమనీ, ఈ సందర్భంగా పార్లమెంటులో ఆయన విగ్రహం ఆవిష్కరించడం ఎంతో సముచితమని ఆ లేఖలో పేర్కొన్నారు. గతంలో టీడీపీ నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం అభ్యర్థన మేరకు అల్లూరి విగ్రహాన్ని పార్లమెంటు హాల్లో ఏర్పాటు చేయాలని 13వ లోక్‌సభలోని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనీ, కానీ నాడు కేంద్రంలో, ఏపీలో ప్రభుత్వాలు మారడంతో విగ్రహా ప్రతిష్ఠాపనలో జాప్యం జరిగిందన్నారు. తదుపరి ఎటువంటి జాప్యం లేకుండా అల్లూరి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

కుల, మత ప్రస్తావన లేని

రాజకీయాలు అవశ్యం

వీరవనితల శిక్షణ తరగతుల్లో పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: కొత్త తరాల కోసం సరికొత్త పార్టీ స్థాపించానని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. వీరమహిళల పునశ్చరణ తరగతులు శనివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో జరిగాయి. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఏ పార్టీ అయినా ప్రారంభంలో చిన్న పార్టీగానే ఉంటుందని, ఇప్పుడు జనసేన అదే పరిస్థితులో ఉందని చెప్పారు. ఒకప్పుడు టీడీపీ, టీఆర్ఎస్, బీజేపీ పరిస్థితి అలాగే ఉందన్నారు. 2014లో జనసేనను స్థాపించామని, ఏడు సిద్ధాంతాలతో పార్టీ పనిచేస్తున్నదని అన్నారు. కుల, మత ప్రస్తావన లేని రాజకీయం రావాలని, భాష, యాసలను గౌరవించకపోతే రాష్ట్రం విచ్ఛిన్నమవుతుందన్నారు. 'నా రాష్ట్రం...నా ప్రాంతం' అంటుంటే జాతీయవాదానికి దూరమవుతామని, సంస్కృతిని, భాషలను గుర్తించి, గౌరవించాలని పవన్ చెప్పుకొచ్చారు. మహిళల గౌరవం పెంచేలా అందరం పనిచేయాలని సూచించారు. మహిళ తలచుకుంటే ఏదైనా సాధించగలదని చెప్పారు. సమాజసేవ కోసం మహిళలు బయటికి రావాలని పిలుపునిచ్చారు. 'ఆడబిడ్డ మానమర్యాదలకు భంగం కలిగితే తల్లి పెంపకాన్ని నిందిస్తారా? ఇదేనా సభ్యత, సంస్కారం... ఆడబిడ్డకు అన్యాయం జరిగితే.. నేరస్తులకు తోడుగా ఉంటారా? ఇలాంటి అరాచకాలకు అండగా ఉండాలని మిమ్ములను గెలిపించలేదు' అని వైసీపీ నేతలను ఉద్దేశించి పవన్ అన్నారు. ఆడపిల్లలు రోడ్ల మీదకు వెళ్ల కూడదని హోంమంత్రి మాట్లాడతారా? అని నిలదీశారు. అధికారమనే ఆశ వైసీపీకి ఉంటే...ఆశయం జనసేనకు ఉందని అన్నారు. ఆశయం ఉన్నవాళ్లకి భూదేవి అంత ఓర్పు ఉంటుందని, సహనాన్ని పరీక్షిస్తే భూకంపం ఎలా ఉంటుందో చూస్తారని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల వల్ల ఇప్పుడు అద్భుతాలు జరగవని, కానీ అద్భుతాలకు ఆలంబనగా, అడుగు పడేలా ఈ తరగతులు నిలుస్తాయని అన్నారు. జనసేనకు ఓటమిని కూడా తీసుకునే ధైర్యం ఉందన్నారు. బూతుల మంత్రులకు మనం భయపడబోమని, దోపిడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. మద్యపానమంటూ ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. పథకాల పేరుతో అధికారికంగా దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రతినెలా సీఎం వ్యక్తిగత ఖాతాకి రూ.250 కోట్లు మద్యం ద్వారా వెళుతున్నాయని ఆరోపించారు. ప్రజలు ఎదురు తిరిగితే తప్ప సమాజంలో మార్పు రాదన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయినా రాజ్యాంగానికి తలవంచాలని, ఆ రాజ్యాంగం ప్రకారం నడిస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. మాట తప్పిన జగన్ ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. నాదెండ్ల మనోహర్, నాగబాబు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

చట్టసభల్లో స్త్రీల ప్రాతినిధ్యం పెరగాలి: నాగబాబు

అంతకుముందు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు కొణిదెల నాగబాబు మాట్లాడుతూ చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరిగినప్పుడే మహిళలకు సాధికారత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ మధ్యకాలంలో అన్ని రాజకీయ పార్టీలు మహిళా సాధికారత గురించి మాట్లాడటమే కానీ చేతలు లేవని ఆరోపించారు. 'మనకు ఎన్ని కష్టాలు, ఎన్ని ఇబ్బందులు ఉన్నా అమ్మ మొహం చూడగానే అన్నీ మరచిపోతాం. మనకు తోబుట్టువులు లాంటి మహిళలు ఓదార్పు ఇస్తారు. అమరావతి ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గౌరవం మహిళలకు దక్కుతోంది. మహిళల వస్త్రధారణపై వ్యాఖ్యలు చేయడం చాలామందికి సరదా అయింది. చూసే కళ్లను బట్టి ఆలోచన ఉంటుంది. మహిళలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉన్నది' అని నాగబాబు పునరుద్ఘాటించారు. పవన్ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ స్వాగతం పలకగా, పార్టీ నేతలు ఏవీ రత్నం, త్రినాథ్, కందుల దుర్గేశ్, సీనియర్ జర్నలిస్ట్ శ్యాంసుందర్, విజయవాడ నగర అధ్యక్షుడు పోతిన వెంకట మహేశ్, పార్టీ లీగల్ సెల్ చైర్మన్ ఇవన సాంబశివ ప్రతాప్, పార్టీ అధికార ప్రతినిధి కోటంరాజు శరత్ కుమార్ వివిధ అంశాలపై వీర మహిళలకు అవగాహన కల్పించారు.

రేపటి నుంచి ఈఏపీసెట్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 4 నుంచి 12 వరకు ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ (ఈఏపీసెట్) పరీక్షలు జరగనున్నాయి. 4 నుంచి 8 వరకు ఇంజనీరింగ్ , 11 నుంచి 12 వరకు అగ్రి కల్చర్, ఫార్మసీ పరీక్ష నిర్వహించను న్నారు. రాష్ట్రంలో 120, తెలంగాణలో 2 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది 3 లక్షల 84 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. నిమిషం నిబంధన ఖచ్చితంగా అమలు చేస్తామని అధికారులు తెలిపారు.

అమెరికాలో పంట కోత విశిష్టత

- సెలవురోజుల్లో కుటుంబ సభ్యులతో కల్సి పాల్గొంటారు
- కూలీల ఖర్చు భరించలేకే ఈ నూతన విధానం అమలు
- వ్యవసాయ క్షేత్ర సందర్శనలో రైతు నేత కేవీవీ పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమెరికాలోని హైన్‌ల్యాండ్ ఫామ్‌హౌస్ వ్యవసాయ క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ సందర్శించారు. అమెరికా మెయిన్ స్టేట్‌లోని న్యూ గౌజ్‌స్టర్ ప్రాంతంలోని హైన్‌ల్యాండ్ ఫాంహౌస్‌ను ఆయన కుటుంబసభ్యులతో వెళ్ళి సందర్శించారు. అక్కడ ఫాం హౌస్‌లో జరుగుతున్న స్టాబెర్రీ పికింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ క్షేత్రంలో స్టాబెర్రీతోపాటు మొక్కజొన్న, బఠాని, గుమ్మడికాయ. సొరకాయ. బ్లూబెర్రీ, కూరగాయలు తదితరాలు పండిస్తున్నారు. సమీప ప్రాంతాల వారు తమ కుటుంబాలతో సహా సెలవుదినాల్లో , శనివారం, ఆదివారాల్లో వ్యవసాయక్షేత్రాలకు వెళ్లి స్వయంగా తమకు అవసరమైన పండ్లు, కూరగాయలు కోసుకుని తూకం వేయించుకుని తగిన సొమ్ము చెల్లించి తెచ్చుకోవటం ఇక్కడ ప్రత్యేకత. స్టాబెర్రీ పండ్లు కోతకు వచ్చే సమయంలో వ్యవసాయ క్షేత్రాలకు చెందిన రైతులే వినియోగదారులను స్వయంగా పంట కోసుకునేందుకు ఆహ్వానిస్తారు. అవసరమైన వారు పిల్లలు, పెద్దలను వెంటపెట్టుకొని పిక్నిక్‌కు వెళ్లినట్లు వెళ్లి అత్యంత ఉత్సాహవంతంగా పాల్గొంటారు. సిటీకి 25 నుంచి 30 కిలోమీటర్ల దూరం వెళ్లి పిక్కింగ్ (పంటకోత)లో పాల్గొని కొంత సమయం ఆనందంగా వ్యవసాయ క్షేత్రంలో గడుపుతారు. వ్యవసాయక్షేత్ర యాజమాన్యం వినియోగదారులను ఆహ్వానించి పంట కోతలో పాల్గొనేలా చేసేందుకు ప్రత్యేక కారణం కూడా ఉన్నది. అమెరికాలో వ్యవసాయక్షేత్రాల్లో పనిచేసే కూలీల కొరత అధికం. కూలీలకు ఇచ్చే వేతనాల ఖర్చు కూడా అధికం. దీనిని తప్పించుకునేందుకు వ్యవసాయక్షేత్రాల యజమానులు అధిక విస్తీర్ణంలో పండించే స్ట్రాబెరీ లాంటి పంట కోతకు అధికంగా కూలీలు అవసరం ఉంటుంది కాబట్టి వినియోగదారులను ఆహ్వానించి వారినే పంట కోతలో భాగస్వాములను చేస్తారు. దానివల్ల కూలీలకు చెల్లించే వేతనాన్ని వారు మిగుల్చుకుంటారు. వ్యవసాయ క్షేత్రంలో కుటుంబాలతో వెళ్లి పంట కోతలో పాల్గొనడం వ్యవసాయంలో ఎన్నడూ పాల్గొనని వారందరికీ ఆనందదాయకం. తమ కార్లలో కుటుంబాలతో చేరుకున్నవారికి వ్యవసాయక్షేత్రంలో పంట కోతలో పాల్గొనేచోటు వరకు వాహన సౌకర్యం ఇతరత్రా సౌకర్యలు కల్పిస్తారు. ఉద్యోగం, వ్యాపారం, ఇంటి పనుల ఒత్తిడి ఇతర వృత్తులలో తలమునకలయ్యేవారు తమ కుటుంబాలతో సహా వ్యవసాయక్షేత్రాలకు వెళ్లడం తమకు అవసరమైన పండ్లు, కూరగాయలు స్వయంగా తెచ్చుకోవడం ప్రత్యేక ఆనందంగా భావిస్తారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో వ్యవసాయ క్షేత్రానికి కుటుంబసభ్యులతో సందర్శించడం, పంట కోతలో స్వయంగా పాల్గొనడం ఆనందాన్ని కలిగించిందన్నారు. అమెరికాలో వ్యవసాయ పరిస్థితులు తెలుసుకునేందుకు మరికొన్ని వ్యవసాయక్షేత్రాలను సందర్శించి ఆయా క్షేత్రాల యజమానులతో చర్చించనున్నట్లు తెలిపారు.

సంపాదకీయం

గట్టి మేలు తలపెట్టని సుప్రీంకోర్టు

న్యాయమూర్తులు తీర్పులు చెప్పేటప్పుడు రాసే మాటలకన్నా విచారణా ప్రక్రియా క్రమంలో పలికే మాటలు చాలా వాడిగా, రసవత్తరంగా, ఆశాజనకంగా ఉంటున్నాయి. మహమ్మద్ ప్రవక్తను అవమానించేలా టీవీ తెరపై వ్యాఖ్యల బాణాలు వదిలిన నూపుర్ శర్మ చేసిన వ్యాఖ్యలను తప్పుబడ్తూ న్యాయమూర్తులు సూర్యకాంత్, ఎస్.వి.పార్దీవాలా అన్న మాటలు వరహాల మూటలే. హిందుత్వం తలకెక్కిన నూపుర్ శర్మ మాటలు దేశంలో చిచ్చు రేపాయి అని ఆ న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల కింద నూపుర్ శర్మ ఓ టీవీ చర్చ సందర్భంగా అన్న మాటలు మతోన్మాద కార్యకలాపాలను రెచ్చగొట్టాయి. దీనితో నూపుర్ శర్మ మీద సామాజిక మాధ్యమాలలో విపరీతమైన దాడి జరుగుతోంది. ఆమె మీద వివిధ ప్రాంతాలలో అనేక కేసులు దాఖలైనాయి. ఈ కేసులన్నింటికీ తాను హాజరు కావడం లేదా కేసులను ఎదుర్కోవడానికి కావలసిన ఏర్పాట్లు చేసుకోవడం కష్టం కనక ఆ కేసులన్నింటినీ ఢిల్లీకి బదిలీ చేయాలని నూపుర్ శర్మ సుప్రీం కోర్టులో అర్జీ పెట్టుకున్నారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని కూడా ఆమె అత్యున్నత న్యాయస్థానానికి విన్నవించుకున్నారు. "ముప్పు ఆమెకు ఉందా లేదా ఆమె వల్ల ఇతరులకు ఉందా? ఆమె దేశంలో భావోద్రేకాలను రెచ్చ గొట్టారు. దేశంలో ఇప్పుడు జరుగున్న వికృత చేష్టలకు, హత్యాకాండకు ఆమె మాటలే కారణం" అని న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. అక్కడితో ఆగకుండా న్యాయస్థానంలో విచారణలో ఉన్న అంశంపై టీవీ చానళ్లు, నూపుర్ శర్మ ఎలా చర్చిస్తారు అని కూడా ప్రశ్నించారు. ఇది హిందుత్వ ఎజెండాను ప్రచారం చేయడమే అని ఆగ్రహించారు. ఆమె అధికార పార్టీ ప్రతినిధి అయినంత మాత్రాన చట్టాన్ని ఉల్లంఘిస్తారా అని కూడా ఆ న్యాయమూర్తి నిలదీశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు నూపుర్ శర్మను ఇప్పటికీ అరెస్టు చేయనందుకు ఢిల్లీ పోలీసుల మీద కూడా న్యాయ మూర్తులు విరుచుకుపడ్డారు. అంటే నూపుర్ శర్మకు అధికార వర్గాల్లో ఎంత పలుకుబడి ఉందో అర్థం అవుతోందని అన్నారు. నూపుర్ శర్మ వ్యాఖ్యల కారణంగానే ఉదయ్ పూర్‌లో దర్జీ కన్హయా లాల్‌ను హత్య చేశారన్నారు. న్యాయం కోసం పాటుబడే వారికి, మానవ హక్కులను పరిరక్షించే వారికి, న్యాయస్థానాలు తమ కర్తవ్యాన్ని సవ్యంగా నిర్వర్తించాలని కోరుకునే వారికి సంతృప్తి కలగజేసే విధంగానే కాక ఆశలు రేకెత్తేట్టుగా న్యాయమూర్తులు సూర్యకాంత్, పార్దీవాలా విమర్శనాత్మకంగా మాట్లాడారు. ఇవన్నీ విన సొంపుగా ఉంటాయి. రేపో మాపో న్యాయం అందరి ముంగిట్లోకి వస్తుందన్న భరోసా కల్పించేలా ఉన్నాయి. కానీ న్యాయమూర్తుల ఇలాంటి పలుకులన్నీ తీర్పుల పేరిట రాసే వందలాది పేజీలలో ఎక్కడా కనిపించవు. తీర్పులు రాసేటప్పుడు న్యాయమూర్తుల ధర్మాగ్రహం నిద్రాణ స్థితిలోకి వెళ్లి పోతుందేమో అన్న అనుమానం కల్గుతుంది. దేశద్రోహ చట్టంలాంటివి ఎంత కిరాతకమైనవో, ప్రాథమిక హక్కులు ఎంత పవిత్రమైనవో న్యాయ మూర్తులు అనేక సందర్భాలలో విడమర్చి చెప్పారు. అయినా ఆ కిరాతక చట్టాలను రద్దు చేయడానికి న్యాయస్థానాలు ఏ మాత్రం చొరవ తీసుకోవు. దేశద్రోహ చట్టంలాంటి వాటిని కొట్టేయవు. ప్రజల ప్రాథమిక హక్కులకు సంబంధించి, దేశ భవిష్యత్తుకు సంబంధించి, మౌలిక రాజ్యాంగ అంశాలకు సంబంధించి దాఖలైన అనేకానేక పిటిషన్లను ఏళ్ల తరబడి అత్యున్నత న్యాయస్థానం కనీసం చర్చకైనా చేపట్టదు. ఏళ్లు గడిచినా హెబియస్ కార్పస్ పిటిషన్లపై విచారణ మొదలే కాదు. ప్రజా వ్యతిరేక, కిరాతక చట్టాలు ఈ లోగా అమలైపోతూనే ఉంటాయి. అమాయకులు ఏళ్ల తరబడి నిష్కారణంగా జైళ్లలో మగ్గుతూనే ఉంటారు. దాదాపు మూడేళ్ల నుంచి కశ్మీర్ స్వయంప్రతిపత్తిని మింగేసిన 370వ అధికరణం రద్దును సవాలు చేస్తూ ఉన్న కేసు సుప్రీంకోర్టు విచారణకు నోచుకోనే లేదు. భీమా కోరే గావ్ కేసులో డజను మందికి పైగా మేధావులు, ప్రజాస్వామ్యం కోసం, పౌర హక్కుల కోసం పాటు పడేవారు, సామాజిక కార్యకర్తలు, దేశం ఆదరించే మేధావులు, ప్రజాభిమానాన్ని సంపాదించిన పేరుపొందిన రచయితలు నాలుగేళ్లుగా జైలులో మగ్గుతూనే ఉన్నారు. అందులో ఒకరైన ఎనిమిది పదులు దాటిన గిరిజన హక్కుల పరిరక్షకుడు స్టాన్ స్వామి నిర్బంధంలో ఉండగానే మరణించారు. 83 ఏళ్ల వయసులో అనేక అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రసిద్ధ కవి, పౌరహక్కుల కార్యకర్త వరవర రావు ఇప్పటికీ అనారోగ్య కారణాలపై శాశ్వత బెయిలు కోసం అనునిత్యం కోర్టుల గుమ్మం ఎక్కుతూనే ఉన్నారు. దిగుతూనే ఉన్నారు. అయినా ఈ కేసు విచారణ దశకు ఎందుకు రాదు అని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు నిలదీసిన సందర్భమే లేదు. ఈ కేసులో నిందితులు బెయిలు కోసం పెట్టుకున్న అర్జీలను మాత్రం వివిధ న్యాయస్థానాలు విచారిస్తూనే ఉన్నాయి. ఈ తతంగం ఎన్నాళ్లు కొనసాగుతుంది అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించదు. రిపబ్లిక్ టీవీ అధినేత, గోదీ మీడియా నడుపుతున్న వారిలో ప్రథమగణ్యుడైన అర్నాబ్ గోస్వామికి బెయిలు మంజూరు చేయడానికి ఇవే న్యాయ స్థానాలు అర్ధ రాత్రి, అపరాత్రి కూడా విచారణ చేపడ్తాయి. ఈ వైరుధ్యం ఎన్నటికీ అర్థం కాదు.

సమాజాన్ని విచ్ఛిన్నం చేసే పరిణామాలను, భిన్న వర్గాల ప్రజల మధ్య విద్వేషం నింపే మతతత్వవాదుల ప్రేలాపనలు ఎన్నడూ సుప్రీంకోర్టు న్యాయ మూర్తులకు వినిపించవు. ఒక ఎజెండా ప్రకారమే విద్వేష ప్రచారం కొనసాగుతోందనీ, దీని కారణంగా ఇప్పటికే అనేక మంది కిరాతకంగా హత్యకు గురైనారని సుప్రీంకోర్టుకో, హైకోర్టులకో తెలియదని అనుకోలేం. అయినా ఒక్కసారి కూడా న్యాయమూర్తులు ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడం విచిత్రం. ఈ భయంకర నిశ్శబ్దం భరించడం కష్టం. చట్ట వ్యతిరేక కార్య కలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ.) వ్యక్తి స్వేచ్ఛకు తావే లేకుండా చేస్తోంది. ఏ పాపమూ ఎరుగని వారు ఈ చట్టం కింద ఏళ్ల తరబడి దిక్కూ మొక్కూ లేకుండా జైళ్లలో మగ్గుతున్నా అత్యున్నత న్యాయస్థానం కిమ్మనదు. వారు "అపరాధం చేసి ఉంటారు" అన్న ఒకే ఒక్క వాదన కారణంగా అనేక మంది జీవితాలు జైళ్లల్లోనే తెల్లారి పోతున్నాయి. వారి జీవితాల్లోని ఫల ప్రదమైన కాలం వృథా అవుతోంది. అయినా అత్యున్నత న్యాయస్థానం చలించదు. ఇది భయంకరమైన పరిస్థితి. న్యాయవ్యవస్థ, చట్టసభలు, కార్య నిర్వాహకవర్గం దేనికది నిర్వర్తించవలసిన బాధ్యత ఇంతవరకు అమలు కానే లేదు. ఈ మూడు రాజ్యవ్యవస్థల మధ్య సమతూకం ఎన్నడూ సంపూర్ణంగా కుదరనే లేదు. చట్టసభలు, కార్యనిర్వాహక వర్గం మీద ప్రజలకు బొత్తిగా విశ్వాసం లేదు. అంతో ఇంతో న్యాయవ్యవస్థ మీదే జనం ఆశలు పెట్టుకున్నారు. ఆ న్యాయవ్యవస్థ అప్పుడప్పుడూ ఆవేశపూరితంగా చెప్పే మాటలు బోలెడు భరోసా కల్పిస్తాయి. ఆచరణ దగ్గరికి వచ్చేసరికి ఆ ఆవేశం ఆవిరైపోతోంది. వలసవాదుల చట్టాలు ఇప్పటికీ అమలవుతోంటే, ప్రాథమిక హక్కులు అడుగడుగుడునా నిరంకుశ పాలకుల పదఘట్టనల కింద నలిగిపోతూ ఉంటే న్యాయవ్యవస్థ నివారించిన దాఖలాలే లేవు. అప్పుడప్పుడూ చెప్పే సుభాషితాలు, పలికే చిలకపలుకులవల్ల ఒరుగుతున్నది ఏమీ లేదు.

రెండంచల సహకార వ్యవస్థ మేలు

కె.వి.యస్. రవి కుమార్

వ్యవసాయ సహకార పరపతి విధానం సమూల మార్పులకు రిజర్వ్ బ్యాంకు నడుం కట్టింది. అందులో భాగంగా ఇటీవల కాలంలో జరుగుతున్న పరిణామాలను క్షుణ్ణంగా గమనిస్తే 26 జూన్ 2020లో కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా పట్టణ సహకార బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, 1949 పరిధిలోకి తీసుకు వస్తూ చట్ట సవరణలు చేపట్టింది. అందులో భాగంగా 23 డిసెంబర్ 2020 న రాష్ట్ర సహకార బ్యాంకులు, జిల్లా సహకార బ్యాంకులు చట్ట పరిధిలోకి వచ్చేలా ఆర్బీఐ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. 2021 ఏప్రిల్‌లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు రాష్ట్ర సహకార బ్యాంకులో విలీనం చేయాలంటే పాటించవలసిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది.

సహకార బ్యాంకులకు సంబంధించిన విలీన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలు కీలక పాత్ర పోషించవలసివుంది. విలీన ప్రక్రియకు సంబంధించిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వాలే ఆర్బీఐకి సమర్పించవలసి వుంటుంది. దేశంలో ఇప్పటికే 10 రాష్ట్రాలు రెండంచల సహకార పరపతి విధానంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్, పంజాబ్, బీహర్, గుజరాత్, ఛండీఘర్ రాష్ట్ర ప్రభుత్వాలు రెండంచల సహకార విధానానికి అనుమతించవలసిందిగా రిజర్వ్ బ్యాంకుకు దరఖాస్తు చేసుకున్నాయి. రెండెంచల విధానం కేరళ రాష్ట్రంలో ఏర్పడిన తరువాత "కేరళ సహకార బ్యాంకు" నకు 700 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం షేర్లను కేరళ సహకార బ్యాంకులో ఉంచడం, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక లావాదేవీలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ప్రభుత్వం డిపాజిట్లతో రాష్ట్ర ప్రభుత్వం మంచి ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతున్నది. కేరళ రాష్ట్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావన్ కోర్ విలీనంలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం కావటం కారణంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా తీసుకొని "కేరళ సహకార బ్యాంకు" ను ఏర్పాటు చేసింది.

1972లో సహకార వ్యవస్థ జాతీయ సదస్సు జరిగింది. దానిలో జరిగిన చర్చలో సహకార బ్యాంకింగ్ రంగంలో వ్యవస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేసింది. దానిపై దశాబ్దం పాటు దేశ వ్యాప్తంగా, వివిధ రాష్ట్రాలలో వివిధ పోరాటాలు చేశారు. దాని ఫలితంగా 1987వ సం॥లో అప్పటి ముఖ్యమంత్రి యన్.టి.రామారావు మొదటి దశగా ఏకగవాక్ష విధానం (సింగిల్ విండో) ప్రవేశ పెడుతూ భూ తనఖా బ్యాంకులను సహకార కేంద్ర బ్యాంకులలో విలీనం చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన అనేకమంది ముఖ్యమంత్రులు రెండంచల విధానాన్ని సూచన ప్రాయంగా అమలుచేయాలని చూసినప్పటికీ అది కార్య రూపం దాల్చలేదు. డాక్టర్ వై.యస్ రాజశేఖరరెడ్డి అప్పుడు చేసిన ధర్నా కార్యక్రమానికి హాజరై రెండంచల విధానం అమలుపై హామీ ఇచ్చారు. ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు.

మూడంచెల పరపతి విధానంలోని లోపాలను గుర్తించి, జిల్లా సహకార బ్యాంకులను, రాష్ట్ర సహకార బ్యాంకులతో విలీనం చేయడం ద్వారా, రెండంచెల విధానాన్ని అమల్లోకి తీసుకువస్తే రైతులకు వడ్డీ భారం తగ్గి, సహకార బ్యాంకులు బలోపేతమవుతాయి. సహకార బ్యాంకులు విలీనమైతే రాష్ట్ర స్థాయిలో సహకార బ్యాంకులను, సహకార సంఘాలను కంప్యూటీకరించుట ద్వారా, ఆధునికసాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టుట ద్వారా వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకులు పని చేస్తాయి. వడ్డీ రాయితీ పథకం క్రింద రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించే వడ్డీ మొత్తంలో రెండంచెల విధానం కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుతమున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకులన్నీ రాష్ట్ర సహకార బ్యాంకు బ్రాంచీలుగా మార్పు చెంది ఆ బ్యాంకుకు ప్రస్తుతం ఉన్న షెడ్యూల్ పరిధిలో అన్ని బ్యాంకు శాఖలకూ వర్తిస్తుంది. తద్వారా ఖాతాదారులలో సహకార బ్యాంకులపై నమ్మకాన్ని పెంపొందించవచ్చు.

జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల విలీనంతో ప్రస్తుతం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులోని డిపాజిట్లు, ఋణముల నిల్వలు రాష్ట్ర సహకార బ్యాంకు నిల్వలుగా రూపాంతరం చెంది రాష్ట్రంలోనే అతి పెద్ద బ్యాంకుగా అవతరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర సహకార బ్యాంకును (ఆప్కాబ్) లీడ్ బ్యాంకుగా గుర్తించి ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో గల పాలక వర్గం ద్వారా గ్రామ స్థాయి వరకు అమలు పరచుటకు వీలవుతుంది. ప్రస్తుతం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు జిల్లా స్థాయిలో విస్తరించి ఉన్నందున విలీనం అనంతరం రాష్ట్ర సహకార బ్యాంకునకు నిర్వహణ భారం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం రెండంచల సహకార వ్యవస్థను అమలు చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ, ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్, సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ చేపట్టిన 4వ తేదీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులకు అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్
ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

మోదీజీ ఇంకేమైనా మిగిలి వుందా?

వి. శంకరయ్య

లోక్‌సభకు 2014లో ఎన్నికలు జరిగిన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో చేసిన ప్రచారంలో తిరుపతితో సహా అనేక చోట్ల నరేంద్రమోదీ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని చేసిన వాగ్దానం ఆయన మరిచిపోయారు. ప్రధాన మంత్రి హోదాలో సుదీర్ఘ కాలం తర్వాత ఏపి పర్యటనకు వస్తున్నారు రాష్ట్ర విభజన జరిగిన సమయంలో పార్లమెంటు ఉభయ సభల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మెజారిటీ లేదు. బీజేపీ ఆమోదం తెలిపిన తర్వాతనే కాంగ్రెస్ రాష్ట్ర విభజనకు పూనుకున్నది. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్‌కు ఎంత పాపముందో బీజేపీకి అంతే సమాన బాధ్యత వుంది. లోక్‌సభ తలుపులు మూసి బిల్లు ఆమోదించిన తర్వాత తెలంగాణ సభ్యులను ఉద్దేశించి "ఈ చిన్నమ్మను గుర్తు పెట్టుకోండి" అని బీజేపీ సభా పక్ష నేతగా దివంగత సుష్మా స్వరాజ్ నోట వచ్చిన మాటలు బీజేపీ అంతరంగాన్ని ఆనాడే ఆవిష్కరించాయి. అవశేష ఆంధ్రప్రదేశ్‌కు అనేక విధాలుగా అన్యాయం జరిగింది. బీజేపీ పాలనలో అన్ని హామీలు దుమ్ములో కలిశాయి.

2014 ఫిబ్రవరి 20వ తేదీ రాజ్యసభలో రాష్ట్ర విభజన చట్టంపై చర్చ జరుగుతున్న సమయంలో బీజేపీ నేత దివంగత అరుణ్ జైట్లీ ప్రస్తుత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చొరవతోనే అవశేష ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రతిపాదన వచ్చింది. పైగా అయిదు ఏళ్లు కాదు పదేళ్లు వుండాలని వెంకయ్య నాయుడు చేసిన సూచన ఏపి ప్రజల చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తోంది. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 46(3) మేరకు అవశేష రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఏడు జిల్లాలు (రాయలసీమ, ఉత్తరాంధ్ర) వెనుకబడి వున్నాయని వీటికి ప్రత్యేక ప్యాకేజీ అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ కోరాపుట్ బోలంగీర్ కలహండి తరహాలో ఇస్తామన్నారు. బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ కూడా ప్రకటించారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదేళ్లకుగాను రూ. 24,350 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే ముష్టిగా జిల్లాకు 50 కోట్లు చొప్పున మూడేళ్లు ఇచ్చి తోక కోసి సున్నం పెట్టడం వాస్తవం కాదా?.

5వ ఆర్థిక సంఘం సిఫార్సులతో 1969లో ప్రత్యేక హోదా ప్రతిపాదన రూపుదాల్చింది. ప్రత్యేక హోదా ఇచ్చేందుకు అయిదు ప్రామాణికాలను ఆర్థిక సంఘం రూపొందించింది. తొలుత అసోం నాగాలాండ్, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాలకు అమలు చేశారు. తదుపరి మరో ఎనిమిది రాష్ట్రాలకు మంజూరు చేశారు. ప్లానింగ్ కమిషన్ ప్రతిపాదనలు తయారు చేసి జాతీయాభివృద్ధి మండలిలో పెట్టి ఆమోదం పొంది అన్ని రాష్ట్రాలకు వర్తింపజేశారు. ఏ రాష్ట్రానికీ చట్టం ద్వారా అమలు చేయలేదు. ఆంధ్రప్రదేశ్ చేసుకున్న పాపమేమిటి? ఏపికి వచ్చేసరికి విభజన చట్టంలో లేదనే ప్రచారం మొదలు పెట్టారు. ఇదెక్కడి న్యాయం? తిరుపతి బహిరంగ సభలో మోదీజీ చేసిన వాగ్దానం ఏమైంది? పార్లమెంటు విభజన చట్టాన్ని ఆమోదించి వున్నందున అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఆమోదించి ఆనవాయితీ మేరకు ప్లానింగ్ కమిషన్‌కు పంపారు. 2014 మార్చి నుండి డిసెంబరు వరకు వేచి వుండి తుదకు ప్లానింగ్ కమిషన్‌ను రద్దు చేశారు. ఆ తర్వాత ప్రతిపాదనలు పెట్టేందుకు ప్లానింగ్ కమిషన్ లేదనే ప్రచారం మొదలైంది. ఆఖరున 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల అమలులోకి రాగానే ఏపి ప్రజల గొంతు కోయడానికి వజ్రాయుధం లభించింది. 14 వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా గల రాష్ట్రాలకు సాధారణ రాష్ట్రాలకు మధ్య తేడా లేకుండా చేసిందని ఇక ఎవ్వరికీ ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని కేంద్ర ప్రభుత్వం ఏపి ప్రజలు నెత్తిన కుండ బద్దలు కొట్టింది. ఒకవేళ ఇచ్చినా పారిశ్రామిక రాయితీలకు నిధులు లేవని ఆనాటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించి ప్రత్యేక ప్యాకేజీ అంటగట్టారు. ఈ కథ అంతటితో ముగియలేదు. 2017లో అప్పటి వరకు ప్రత్యేక హోదా పొందుతున్న రాష్ట్రాలకు పది సంవత్సరాలకు పారిశ్రామిక రాయితీల కింద 4284 కంపెనీలకు 27,413 కోట్ల రూపాయలు కేంద్ర మంత్రివర్గం ఆమోదంతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

అవశేష ఆంధ్రప్రదేశ్‌కు చట్టబద్ధత గలదీ పోలవరం ప్రాజెక్టు. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 90 (1) మేరకు పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. సబ్ సెక్షన్ (4) మేరకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన నిధులతో నిర్మించాలి. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు కేంద్రం ప్రభుత్వం తీసుకురావాలి. దశల వారీగా కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును నిజంగానే గోదావరి వరద పాలు చేస్తోంది. తొలుత ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రం భరిస్తామన్నారు. అటు తర్వాత 2013-14 షెడ్యూల్ రేట్లు మేరకు నిధులు ఇస్తామన్నారు. పైగా తాగునీటి వ్యయం భరించబోమని ఫిట్టింగ్ పెట్టారు. వాస్తవంలో విభజన చట్టంలో ఎక్కడా ఇలాంటి నిబంధనలు లేవు. ఏడెనిమిదేళ్లు గడుస్తున్నా రెండవ డిపిఆర్ ఆమోదించలేదు. తాజాగా కేవలం ఒక బ్యారేజీగా మిగిలిపోయే విధంగా 41.15 మీటర్లకు నీరు నిల్వ చేస్తే అవసరమైన నిధులు గురించి చర్చ సాగిస్తున్నారు. (ఇప్పుడు ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం ఏర్పడింది.) మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపించి వున్న బుందేల్‌ఖండ్ ఏరియాకు తాగు, సాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన కెన్-బెత్వా నదుల అనుసంధానం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఈ పథకానికి ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో 6700 కోట్ల రూపాయలు కేటాయించింది. అంతేకాదు. ఈ పథకం నిర్మాణ వ్యయం 44,608 కోట్లు మొత్తం భరించేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో తాగునీటి వ్యయం భరించేందుకు అంగీకరించింది. కాని చట్టబద్ధతతో జాతీయ ప్రాజెక్టుగా వున్న పోలవరం ప్రాజెక్టుకు ఏనాడు కేంద్రబడ్జెట్‌లో ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదు. కెన్-బెత్వా ప్రాజెక్టులో కేంద్రమే తాగునీటి వ్యయం భరిస్తున్నా పోలవరం ప్రాజెక్టుకు చెంది తాగునీటి వ్యయం భరించలేమని షరతు విధించింది. ఆంధ్రప్రదేశ్‌పజలకెందుకూ శిక్ష! వివక్ష? ముందు దగా! వెనుక దగా! అడుగడుగున దగా! మరీ దుర్మార్గమేమంటే ఇంత జరుగుతున్నా కేంద్రాన్ని నిలదీసే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదు.

పులి మీద పుట్ర లాగా వెనుకబడిన రాయలసీమ వాసులకు కేంద్రప్రభుత్వం మరో భారీ షాక్ ఇచ్చింది. తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతున్నదని బోర్డు ఏపి కోటాలో కోత విధిస్తున్నది. ఈ పరిస్థితుల్లో తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టుకు దన్నుగా ఎగువ సమానాంతర కాలువ ప్రతిపాదన ఏళ్ల తరబడి నానుతూ వుంది. దానికి మోక్షం లేదు. తుంగభద్ర ఎగువున అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్నాటక బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించడం కేంద్ర ప్రభుత్వం ఏకంగా జాతీయ హోదా ఇచ్చి 1200 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు విషయంలో తూతూ మంత్రంగా ఏపి అభ్యంతరాలు పెడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇదిలా వుండగా రాష్ట్రం మొత్తం మీద ముప్పయి మంది పైచిలుకు యువకుల బలి దానాలతో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలో నెలకొల్పారు. ఇప్పుడు దాదాపు 500 రోజులకు పైగా ఈ ప్రాజెక్టు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమం చేస్తున్నా మోదీ పట్టించుకోవడం లేదు. ఇంకా ఇంకా లెక్క లేనన్ని అపకారాలు అన్యాయాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలు భరిస్తున్నారు. దుగ రాజపట్నం ఓడరేవు సముద్రం ఉప్పెనకు పోయింది. కడప ఉక్కు కర్మాగారం తుప్పు పట్టిపోయింది. రైల్వే జోన్ పట్నాయక్‌ల పట్టాలు తప్పి బోల్తా పడింది. ఆఖరుగా ప్రధానమంత్రి పునాది రాయి వేసిన అమరావతి రాజధాని బీడు బోయింది. అమరావతిలో రాజధానికి తను వేసిన పునాదీ రాయి ప్రాంతాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పనిలో పనిగా ఒకమారు సందర్శించి వెళితే దగాపడ్డ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎంతో కొంత ఊరట లభిస్తుంది.

వ్యాస రచయిత విశ్రాంత పాత్రికేయులు 9848394013

ప్రభుత్వ నిర్ణయాలకు ఎదురు దెబ్బలు

డాక్టర్ దేవరాజు మహారాజు

దేశంలో ప్రస్తుతం విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులే మూకుమ్మడిగా బయటకి వచ్చి, తాము స్వతంత్రంగా విధులు నిర్వహించలేకపోతున్నామని దేశ ప్రజల ముందు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా సుప్రీంకోర్టులో, పలు రాష్ట్రాల హైకోర్టులలో న్యాయమూర్తులు ప్రభుత్వ నిర్ణయాల్ని తీవ్రంగా తిప్పి కొడుతున్నారు. సహేతుకంగా ఆలోచించి సామాన్య ప్రజల బాగోగులు చూడడం ప్రభుత్వాల బాధ్యతేనని మళ్ళీ మళ్ళీ చెపుతున్నారు. ఉదాహరణకు టెలికాం కంపెనీల కేసు గమనించండి.

టెలికాం కంపెనీలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన 92 కోట్ల ఏజీఆర్ బకాయిలను వసూలు చేయవద్దంటూ సంబంధిత అధికారులకు టెలికాం మంత్రిత్వ శాఖ డెస్క్ ఆఫీసర్ రాసిన లేఖపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డెస్క్ అధికారితో పాటు టెలికాం సంస్థలకు కోర్టు ధిక్కార నోటీసులు పంపించింది. ఈ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ అరుణ్ మిశ్రా చేసిన వ్యాఖ్యలు గమనించదగ్గవి. 'దేశంలో బోడి పాలన జరుగుతూ ఉందని' దేశ ప్రజల అంతరంగాన్ని ఆవిష్కరించారు. ఈ దేశంలో బతకడం కంటే దేశాన్ని వదిలిపోవడమే మంచిదని అన్నారు. దేశంలో ఎలాంటి న్యాయం మిగిలి లేదని, అందువల్ల సుప్రీంకోర్టును ఎత్తేద్దామా? అని కూడా ఆయన ఆగ్రహించారు. తానెంతో ఆవేదనకు గురవుతున్నాననీ, ఈ కోర్టులో పనిచేయక పోవడమే మంచిదని జస్టిస్ అరుణ్ మిశ్రా బాధపడ్డారు. తమ ఆదేశాలను పక్కనపెట్టి టెలికాం మంత్రిత్వశాఖ డెస్క్ ఆఫీసర్ నియామకం ఎలా జరిపిందని, దాని వెనుక డబ్బు కోణం ఏమైనా ఉందా? అని జస్టిస్ అరుణ్ మిశ్రా ప్రభుత్వానికి ఎన్నో ప్రశ్నలు గుప్పించారు. ఏమైనా, ఆ డెస్క్ ఆఫీసర్ జైలుకు వెళ్ళాల్సిందేనని అన్నారు.

ఇది ఇలా ఉంటే, అహ్మదాబాదులోని మున్సిపల్ కార్పొరేషన్ మాంసాహారాన్ని నిషేధించింది. ఆహారం అమ్మే దుకాణాలలో మాంసం వంటకాలు ఏవీ అమ్మకూడదని ఆంక్షలు విధించింది. ఆ విషయం గుజరాత్ హైకోర్టుకెక్కింది. అక్కడ జస్టిస్ బిరేన్.ఎ.వైష్ణవ్ తన తీర్పులో అహ్మదాబాదు మున్సిపల్ కార్పొరేషన్ చర్యను తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఏది తినాలో ఏది తినకూడదో నిర్ణయించే అధికారం మీకెవరిచ్చారని మండిపడ్డారు. పైన అధికారంలో ఉన్నవారి అహాన్ని సంతృప్తిపరచడానికి ఇలాంటి దిగజారిన తక్కువ స్థాయి నిర్ణయాలు తీసుకోగూడదని హితవు పలికారు. ఆహారపు అలవాట్ల కారణంగా జనాన్ని విడగొడతారా? అని ప్రశ్నించారు. సామాన్యుడి హృదయ ఘోషను తన తీర్పులో పొందుపరిచిన జస్టిస్ ప్రజల మన్ననను పొందారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా వెలువడిన హైకోర్టు తీర్పు ప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పికొట్టింది.

ప్రఖ్యాత నాటక కర్త జార్జి బెర్నాండ్ షా ఎప్పుడో చెప్పారు. అది ఇప్పుడు మనదేశంలో చూస్తున్నాం. ఆయనేమన్నారంటే "రెండు శాతం ప్రజలు ఆలోచిస్తారు. మరో మూడు శాతం జనాలు తాము ఆలోచిస్తున్నామని అనుకుం టారు. ఇక మిగతా 95 శాతం మంది మాత్రం అస్సలు ఆలోచించరు! ప్రభుత్వ సంస్థలు నష్టాల్లో ఉన్నాయని ప్రైవేటు వాడికి అమ్మేస్తున్నారు. మళ్ళీ ఆ ప్రైవేటు వాడు నష్టాల్లో ఉన్నాడని వాడి రుణాలు మాఫీ చేస్తున్నారు. ఇదే మన పాలకుల దేశభక్తి. పెరుగుతున్న పెట్రోల్ ధరలపై ఉత్తరప్రదేశ్ బీజేపీ మంత్రి ఉపేంద్ర తివారి ఎంత కామెడీగా వ్యాఖ్యానించారో గమనించండి. "సమాజంలో 95 శాతం మందికి పెట్రోలు అవసరం లేదు. కార్లూ, బైక్‌లు ఉన్నవాళ్ళు మన జనాభాలో ఏ కొద్దిమందో కదా? వారు ఈ భారాన్ని సులభంగా, సునాయాసంగా భరించ గలరు". తెలుగు టీవీ ఛానళ్ళల్లో కామెడి స్టార్స్ ప్రోగ్రాం చూసిన వారికి ఎంత డోకు వస్తుందో, ఈ మంత్రి వ్యాఖ్యలు కూడా అంతకు రెండింతలుగా డోకు తెప్పి స్తుంది. మన ప్రధాని వాడుతున్న మేబ్యాక్ జర్మన్ కంపెనీ కళ్ళజోడు ధర లక్ష అరవై వేలు. ఆయన తల్లి మాత్రం విరిగిన కళ్ళజోడుకు తాడు కట్టుకుని వాడుకుంటోందని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. సరే అది వదిలేద్దాం. ఆయన మెర్క్ బెంజ్ కారు ధర పదకొండు కోట్లు. జార్జియో అర్మానీ సూట్, మొవాడో వాచ్, కెన్నెత్ కోల్ షూస్ వంటివన్నీ విదేశాల నుండి దిగుమతి చేసుకున్నవే. మరి 'మన్ కి బాత్'లో చెప్పేదేమిటి? "దేశవాసులారా! మిత్రులారా!! భారతదేశంలో తయారు చేసిన ఉత్పత్తులను మాత్రమే కొనండి-మేక్ ఇన్ ఇండియా" అని కదా? తన దేశ ప్రజలకు సరైన తిండీ, గుడ్డా లేదని గ్రహించిన మహాత్మా గాంధీ మోకాళ్ళపైకి చిన్న పంచె కట్టుకుని, చొక్కా కూడా లేకుండా స్వాతంత్ర్య సమరంలో ముందు నిలిచారు.

కేరళలో ఒక చిత్రమైన విషయం కోర్టుకెక్కింది. ఒక్కొక్క డోసుకు రూ. 750/-లు చెల్లించి తను ప్రైవేటుగా వాక్సిన్ వేయించుకుంటే కొవిడ్ వాక్సిన్ సర్టిఫికేట్‌పై నరేంద్ర మోదీ ఫొటో ఎందుకూ? ఆయన ఫొటో ప్రచురించాల్సిన అవసరమేమిటీ? అని కేరళలో ఒక వ్యక్తి కోర్టుకెక్కాడు. ప్రభుత్వం ఉచితంగా వాక్సిన్ వేస్తే ప్రధాని ఫొటో ఉంటే కొంతరకు సబబేమో గానీ, డబ్బు చెల్లించి ప్రైవేటుగా వేయించుకున్న వ్యాక్సిన్ గనక దానికి సంబంధించిన సర్టిఫికెట్‌పై ఆయన ఫొటో ఎందుకూ? అని! మనదేశపు బ్యాంకుల్ని లూటీ చేసి పారిపోయిన వారిలో నీరవ్ మోదీ ఒకడు. చాలామందికి గుర్తుండే ఉంటుంది. అతను లండన్ కోర్టులో కొన్ని వాస్తవాలు ప్రకటించాడు. కొంత గణితశాస్త్రం కూడా బోధించాడు. పదమూడు వేల కోట్లలో తనది 32 శాతమేననీ.. మిగతాది అంతా బీజేపీ నేతలే తిన్నారని (8,840 కోట్లు) ప్రకటించాడు. పైగా తనకు వచ్చిన రూ. 4,160 కోట్లలో నుంచి మళ్ళీ 456 కోట్లు బీజేపీ నేతలకు కమీషన్ ఇవ్వాల్సి వచ్చిందనీ- అందువల్ల, వెరసి తనకు మిగిలింది 3,704 కోట్లయితే 12,544 కోట్లు బీజేపీ నాయకులే స్వాహా చేశారనీ లండన్ కోర్టులో ప్రకటించాడు. దాంతో స్వచ్ఛ భారత్‌కు స్వచ్ఛమైన నిర్వచనం ఇదేనని చెప్పినట్లుంది. బయట అవాకులు చవాకులు మాట్లాడతారేమో గానీ, కోర్టులో మాట్లాడలేరు కదా? అందుకే కాబోలు "మర్ నే వాలేక హాత్ పకడ్ సక్తే హై / బోల్ నె వాలే కి జుబాన్ నహీం" అని అన్నారు. అంటే చనిపోయినవాడి చేయి పట్టుకోవచ్చు కానీ చెప్పేవాడి నాలుకను ఎలా పట్టుకోగలవూ? అని అర్థం!

కేరళలో ఉన్నది కమ్యూనిస్ట్ ప్రభుత్వం కాబట్టి అక్కడ ఒక ఏనుగు చనిపోయినా గోదీ మీడియా గోల గోల చేస్తుంది. అదే బీజేపీపాలిత రాష్ట్రాల్లో మనుషులు చచ్చినా పట్టించుకోదు. ఉదాహరణకు నాగాలాండ్‌లో సైన్యం 15 మంది అమాయక పౌరుల్ని కాల్చి చంపితే పెద్దగా వార్త కాలేదు, హడావుడి లేదు. శ్రద్ధాంజలి లేదు. అదే బిపిన్ రావత్ హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోతే పదిరోజులు ప్రత్యక్ష ప్రసారాలు చేస్తారా? దేశానికి ఆయన అందించిన సేవలేమిటీ? అనేది ఆలోచించరా? పైరవీలు చేసి పెద్ద పోస్టులో కూచుంటే మహానుభావులవుతారా? "అనర్హులకు నివాళులర్పించకండి" అంటూ దేశ ప్రజల నుండి తీవ్రంగా వ్యతిరేకత వస్తే గోది మీడియా పట్టించుకోలేదు. బిపిన్ రావత్ ఆర్మీ చీఫ్‌గా ఉన్న ప్పుడే వివాదాస్పదుడు. అలాంటిది తొలి డిఫెన్స్ స్టాఫ్ చీఫ్‌గా పదోన్నతి పొందడం కూడా వివాదాస్పదమే! ఒక సందర్భంలో నాగ్‌పూర్‌లో ఆరెస్సెస్ చీఫ్‌ను యూనిఫాంలో అధికారికంగా కలిసి తన పదవి ప్రతిష్ఠను తనే దిగజార్చుకున్నాడు. ఈయన గురించి సీనియర్ కాంగ్రెస్ నేత చిదంబరం ఇలా అన్నారు. "బిపిన్ రావత్ జనరల్‌గా కాకుండా అధికార బీజేపీ ప్రతినిధిగా మాట్లాడటం మానుకోవాలి!" అని హితవు పలికారు. కశ్మీరు ప్రజలపై రావత్ చేసిన దాష్టీకం చాలా ఉంది. అలాంటి వాడికి ఈ దేశ ప్రజల సొమ్ము నెలకు రెండున్నర లక్షలు జీతంగా కట్టబెట్టారు. అతని వల్ల ఈ దేశానికి జరిగిన మేలేమైనా ఉందా అంటే శూన్యం.

చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద 2007 ఉత్తరాఖండ్ ప్రభుత్వం జర్నలిస్ట్ ప్రశాంత్ రాహీపై కేసు బనాయించింది. పద్నాలుగేళ్ళ సుదీర్ఘ కాలం విచారణ జరిగింది. ఇటీవల 2022 జనవరి 7న ఆయన 'నిర్దోషి' అని కోర్టు తీర్పు చెప్పింది. పోలీసులు ఎన్నెన్ని అబద్ధపు సాక్ష్యాలు సృష్టించి కుట్రలు చేసినా ప్రభుత్వ పథకం ఫలించలేదు. కేసు నమోదు చేయడం దగ్గర్నుంచి ఆధారాలు సేకరించడం, చివరకు ప్రశాంత్ రాహీని నిందితుడిగా నిరూపించే దాకా ఎందులోనూ పోలీసులు చట్టబద్ధతని పాటించలేదని న్యాయమూర్తి కేసు కొట్టేశారు. ప్రశాంత్ రాహీ మామూలు జర్నలిస్టు కాదు మేధావిగా, సామాజిక కార్యకర్తగా ఎంతో చురుకుగా పనిచేసినవాడు. హిమాచల్ టైమ్స్, స్టేట్స్‌మెన్ వంటి పత్రికలకు పనిచేసినవాడు. ఆ తర్వాత ఉద్యోగం వదిలి స్వతంత్ర జర్నలిస్ట్‌గా పని చేస్తూ "ఉత్తరాఖండ్ సంయుక్త సంఘర్ష్ కమిటీ" స్థాపించి కార్యకర్తగా మారాడు. అతని కార్యకలాపాలు చూసి భరించలేక ప్రభుత్వం యుఎపిఎ కింద అతని మీద కేసు బనాయించింది. అతని విలువైన పద్నాలుగేళ్ళ జీవితాన్ని వృథా చేసింది. కుట్రలు, అబద్ధాలు ఎప్పటికీ గెలవవన్నట్లు, న్యాయస్థానం అతణ్ణి నిర్దోషిగా ప్రకటించింది. అతని పద్నాలుగేళ్ళ జీవితాన్ని అతని కార్యాచరణని మళ్ళీ ఎవరు వెనక్కి తీసుకురాగలరూ? ప్రభుత్వాలు బనాయించే కేసులు ఎలా ఉంటున్నాయీ? న్యాయమూర్తులు వాటిని ఎలా కొట్టేస్తున్నారూ తెలుసుకోవడానికి ఇదొక ఉదాహరణ! అయితే ప్రశాంత్ రాహీ ఇంకా జైల్లోనే ఉన్నాడు. ఆయన మీదున్న మరో కేసు ఇంకా విచారణకు రాలేదు.

ఒకతను చెట్టు కింద తాయెత్తులు, యంత్రాలు అమ్ముతున్నాడు. "ఇవి మహిమ గల తాయెత్తులు-యంత్రాలు" అని పక్కనే బోర్డు కూడా పెట్టుకున్నాడు. దారినపోయే ఆసామి ఓ క్షణం అక్కడ ఆగి, పరిస్థితి గమనించి ఇలా అన్నాడు. "ఇన్నిన్ని తాయెత్తులు, యంత్రాలు ఉన్నవాడివి. నువ్వే చెట్టు కింద కూర్చుని ఈగలు తోలుతున్నావూ? ఇక నేను ఒక్కటి కొని గొప్పోణ్ణి ఎలా అవుతాన్రా తింగరోడా?" అని ఎగతాళిగా నవ్వుతూ వెళ్ళిపోయాడు. ఇది కేవలం కార్టూన్ మాత్రమే కాదు. అర్థం చేసుకుంటే ఇంకా చాలా ఉంది. విగ్రహాలు ప్రతిష్టిస్తూ, ఆలయాలు పునరుద్ధరిస్తూ, కుంభమేళాలు నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం చెట్టుకింద తాయెత్తులు పెట్టుకుని కూర్చున్నవాడి కన్నా ఏమైనా మెరుగ్గా ఉందా? స్థాయిలో తేడా లుండవచ్చుగాక, భావదారిద్ర్యంలో సమానమే కదా? ప్రభుత్వ సంస్థల్ని రోడ్డున పడేసి తాయెత్తులు అమ్మినట్లు అమ్ముతున్నారు కదా? ఏమిటీ తేడా? తాయెత్తులతో కలసి వచ్చే అదృష్టమేమీ ఉండదు గానీ, ఇక్కడ కార్పొరేట్లు మాత్రం లాభపడతారు. జనం ఎగతాళిగా నవ్వుతున్నారంటే నవ్వరా మరి? "నువ్వు చెడ్డవాడివైనా పర్వా లేదు కానీ అబద్ధాలకోరువో, మోసగాడివో మాత్రం కావద్దు!" అన్నాడు రష్యన్ మహా రచయిత లియో టాల్‌స్టాయ్. మరి మన పరిపాలకులు అబద్ధాలతో, మోసాలతో కాలం గడుపుతుంటే... దేశ ప్రజలు ఏం చేస్తున్నట్టూ? ఆచరణ తర్వాత - కనీసం ఆలోచిస్తున్నారా?

వ్యాస రచయిత కేంద్ర సాహిత్య
అకాడెమి విజేత, జీవ శాస్త్రవేత్త.

విశాలాంధ్ర

5

ఆదివారం

03 జులై 2022

న్యాయవ్యవస్థ జవాబుదారీగా ఉండాల్సింది రాజ్యాంగానికి మాత్రమే

సీజేఐ ఎన్వీ రమణ

న్యూఢిల్లీ: దేశంలోని అధికార-ప్రతిపక్షాలు న్యాయవ్యవస్థ తమకు అనుకూలంగా ఉండాలని భావిస్తాయిగానీ న్యాయ వ్యవస్థ దేనికైనా జవాబుదారీగా ఉండాలంటే అది కేవలం రాజ్యాంగానికి మాత్రమే అని భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ అన్నారు. ఆయన శనివారం అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ అమెరికన్స్ నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నాగానీ ప్రతి ఒక్క వ్యవస్థకు రాజ్యాంగం అప్పగించిన బాధ్యతలు, అవి పోషించే పాత్రలపై ప్రజలకు అవగాహన లేకపోవడం అసంతృప్తికరమని అన్నారు. నేటికీ వాటిని అభినందించడం తెలియకపోవడం నిరాశపరుస్తుందన్నారు. భారతదేశంలో రాజ్యాంగ సంస్కృతిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వ్యక్తులు, వ్యవస్థల బాధ్యతల గురించి మనం అవగాహన కల్పించాలి. ప్రజాస్వామ్యం అనేది భాగస్వామ్యానికి సంబంధించినది అని సీజేఐ అన్నారు. భారతరాజ్యాంగం ప్రకారం పాలకులపై ప్రతి ఐదేళ్లకొకసారి తీర్పులను పౌరులు వెలువరిస్తారు అన్న అబ్రహం లింకన్ మాటలను జస్టిస్ రమణ ఉటంకించారు. 'భారత పౌరులు ఇప్పటివరకు తమ పనిని సమర్థంగా చేస్తూ వచ్చారు. పౌరుల విజ్ఞతను సందేహించాల్సిన అవసరం లేదు. పట్టణాలోని ఓటర్లు విద్యావంతుల కంటే గ్రామీణ ఓటర్లు క్రియాశీలంగా ఉంటారని సీజేఐ తెలిపారు. భారత్, అమెరికా దేశాలో వైవిధ్యతకు పేరుగాంచాయి అని ప్రపంచమంతా దీనిని గౌరవించాలని అన్నారు. వైవిధ్యాన్ని అమెరికా గౌరవిస్తుంది కాబట్టి మీరు ఈ దేశానికి చేరుకోగలిగారు. మీ కష్టం, అసాధారణ నైపుణ్యత ద్వారా చెరగని ముద్ర వేసుకున్నారు. దయచేసిగుర్తుపెట్టుకోండి. అమెరికా సమాజ సహనం, సమ్మిళిత స్వభావం వల్ల ప్రపంచ నలుమూల నుంచి ప్రతిభావంతులను ఆకర్షించగలుగుతుంది. తద్వారా అభివృద్ధి పెరుగుతుంది. ఈ కలుపుకుపోయే సూత్రం సార్వత్రికమైంది. ఇది భారతదేశంలో సహా ప్రపంచంలోని ప్రతిచోటా గౌరవించబడాలి' అని అన్నారు. మనల్ని విడదీసే విషయాలపై కాకుండా ఏకం చేసే అంశాలపై దృష్టి సారించాలన్నారు. 21వ శతాబ్దంలో చిన్న, సంకుచిత, విభజన సమస్యలను మానవులను నిర్దేశించడానికి అనుమతించలేం. సామాజిక సంబంధాలు. మానవ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించడానికి అన్ని సమస్యలను అధిగమించాలి. అసంబద్ధమైన విధానం విపత్తుకు ఆహ్వానం' అని అన్నారు. మీరు కోటీశ్వరులు అయి ఉండవచ్చుగానీ దానిని ఆశ్వాదించాలంటే మీ చుట్టూ ప్రశాంతత ఉండాలన్నారు. మీ స్వస్థలాల్లో తల్లిదండ్రులు, సమాజం ప్రశాంతంగా ఉండాలి. హింస, విద్వేషం ఉండరాదు అని సీజేఐ అన్నారు. మీ స్వస్థలంలో మీకు ఎంత గౌరవం ఉందన్నది ముఖ్యమన్నారు. మీ నిజమైన విజయానికి ఇది అగ్నిపరీక్ష అని అన్నారు. ఆధునిక అమెరికా నిర్మాణంలో అమెరికాలోని ప్రవాస భారతీయులు చురుకైన పాత్ర పోషించారని సీజేఐ అన్నారు. 2021లో 113 బిలియన్ డాలర్ల విలువైన భారీ ద్వైపాక్షిక వస్తువుల వాణిజ్యానికి దారితీసింది. 50శాతం బిజినెస్-టు-బిజినెస్ స్టార్ట్-అప్‌లు ఉన్నాయని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. సిలికాన్ వ్యాలీలో వీటిని భారతీయులు స్థాపించారు లేదా నిధులు సమకూర్చారు లేదా నిర్వహిస్తున్నారని సీజేఐ అన్నారు.

త్వరలో పంజాబ్ మంత్రివర్గం విస్తరణ

చండీగఢ్: త్వరలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తన మంత్రివర్గం విస్తరణ చేపట్టనున్నారు. కనీసం ఐదుగురు ఎమ్మెల్యేలను మంత్రులను చేయాలని చూస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అలా చేస్తే భగవంత్‌మాన్‌తో కలిపి కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరుకుంటుంది. అపూర్వమైన ఘన విజయం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ 10 మంది ఎమ్మెల్యేలతో కలిసి మొదటగా మంత్రి వర్గం ఏర్పడింది. మొత్తంగా కేబిఎట్‌లో ముఖ్యమంత్రి పదవితో కలిపి 18 స్థానాలు. ప్రస్తుతం కేబినెట్‌లో తొమ్మిదిమంది మంత్రులు ఉన్నారు. లంచం కేసులో ఆరోగ్యశాఖ మంత్రి విజయ్ సింగ్లాను పదవి నుంచి తప్పించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ప్రస్తుతం చేపట్టే విస్తరణలో మహిళ, హిందూ ముఖం ఉండే అవకాశం ఉన్నట్టు సమాచారం.

బరాక్ కట్ట ఉల్లంఘించిన వ్యక్తి అరెస్ట్

హాయిలకండి: సిల్చార్ పట్టణంలో వరదలకు దారితీసిన బరాక్ నది కరకట్టను ఉల్లంఘించినందుకు అసోంలోని కాచర్ జిల్లాలో అమన్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. బెత్‌కుండి ప్రాంతానికి చెందిన కాబుల్ ఖాన్‌ను శుక్రవారం రాత్రి అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్న పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ శుక్రవారం గట్టు స్థలాన్ని సందర్శించినప్పుడు ఖాన్ ఆ దృశ్యాలను వీడియో చిత్రీకరించారని ఆరోపించారు. వీడియోలోని మాటలను గుర్తించామని శర్మ ప్రజలను కోరారు. దీంతో ఖాన్ గొంతును కొంతమంది పసిగట్టారు. అతడిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నామని, అనంతరం అరెస్టు చేశామని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనలో ప్రమేయమున్న మరికొందరిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. కరకట్టను అక్రమార్కులు బద్దలు కొట్టారని జిల్లా యంత్రాంగం చెబుతుండగా, మే నెలలో వచ్చిన వరదల కారణంగా ఇది ఇప్పటికే పాడైపోయిందని, మరమ్మతులు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. మరమ్మతులు చేయాలని పదే పదే విన్నవించడంతో ఆ ప్రాంతానికి చెందిన కొందరు తమ ఇళ్లలోకి వచ్చిన నీరు నదిలోకి వెళ్లేలా కట్టను తవ్వినట్లు స్థానికులు తెలిపారు. అయితే, బరాక్ నది మట్టాలు పెరగడంతో, జూన్ 19న తెగిపోయిన కట్ట ద్వారా నీరు లోపలికి వచ్చింది. వరదను 'మానవ నిర్మితం' అని పేర్కొంటూ, కేసు నమోదు చేశామని, ఈ విషయాన్ని సీఐడీ దర్యాప్తు చేస్తుందని శర్మ శుక్రవారం చెప్పారు.

బీజేపీలో కలవనున్న అమరేందర్ పార్టీ

చండీగఢ్: వెన్ను నొప్పితో బాధపడుతూ విదేశాల్లో చికిత్స చేయించుకుంటున్న పంజాబ్ లోక్ కాంగ్రెస్ అధినేత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరేందర్ సింగ్ త్వరలో తన పార్టీని భారతీయ జనతా పార్టీలో విలీనం చేయనున్నారు. అయితే పార్టీ నుంచి దీనిపై ఎలాంటి స్పందనా లేదు. దీనిపై బీజేపీ నాయకుడు హర్జీత్ సింగ్ గ్రేవల్ శనివారం మాట్లాడుతూ ఇప్పటికే దీనిపై నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. లండన్ వెళ్లేముందుకు తన పార్టీని బీజేపీలో విలీనం చేయాలని చెప్పారని గ్రేవల్ తెలిపారు. ఆయన విదేశాల నుంచి తిరిగి వచ్చాక విలీనం విషయం బయటకు తెలుస్తుందన్నారు.

విరిగిపడ్డ కొండచరియలు.. 27మంది మృతి

ఇంఫాల్ : మణిపూర్‌లోని నోనీ జిల్లాలో టెరిటోరియల్ ఆర్మీ క్యాంపు వద్ద భారీ కొండచరియలు విరిగిపడ్డ విషయం తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య 27కు పెరిగిందని అధికారులు శనివారం తెలిపారు. మృతుల్లో 18 మంది జవాన్లు ఉన్నారని, ఇప్పటి వరకు టెరిటోరియల్ ఆర్మీకి చెందిన 13 మంది సిబ్బంది, ఐదుగురు పౌరులు రక్షించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇంకా 38 మంది ఆచూకీ తెలియడం లేదని అధికారులు పేర్కొన్నారు. తూపుల్ యార్డు రైల్వే నిర్మాణ ప్రాంతానికి సమీపంలోని టెరిటోరియల్ ఆర్మీ క్యాంపు వద్ద బుధవారం రాత్రి కొండచరియలు విరిగిపడ్డాయి. శిథిలాల కింద ఇంకా చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు భారత సైన్యం, అసోం రైఫిల్స్, టెరిటోరియల్ ఆర్మీ, కేంద్ర, రాష్ట్ర విపత్తు దళాలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. వర్షాలతో పాటు ఇతర కారణాలతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నది. మణిపూర్ సీఎం ఎన్ బీరెన్ సింగ్, ఆర్మీ, సివిల్ అధికారులతో కలిసి శుక్రవారం విపత్తు ప్రదేశాన్ని సందర్శించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.50వేల చొప్పున పరిహారం అందజేస్తామని సీఎం ప్రకటించారు. ఈ ఘటనలో బెంగాల్‌కు చెందిన తొమ్మిది మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు.

ఆ నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేస్తాం

తిరుగుబాటు ఎమ్మెల్యే

ముంబై : మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను 'శివసేన నాయకుడు' పదవి నుంచి తొలగించే నిర్ణయాన్ని ఉద్ధవ్ ఠాక్రే ఉపసంహరించుకోకుంటే, తరువాత వారు ఆ చర్యను చట్టపరంగా సవాలు చేస్తారని సేన తిరుగుబాటు ఎమ్మెల్యే ఒకరు శనివారం తెలిపారు. శివసేన అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఠాక్రే శుక్రవారం 'పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు' పాల్పడుతున్నారని ఆరోపిస్తూ షిండేను 'శివసేన నాయకుడు' పదవి నుంచి తొలగించారు. షిండే 'స్వచ్ఛందంగా' పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నారని, అందువల్ల 'శివసేన పార్టీ అధ్యక్షుడిగా నాకు లభించిన అధికారాలను ఉపయోగించి, పార్టీలో శివసేన నాయకుడి పదవి నుంచి మిమ్మల్ని తొలగిస్తున్నాను' అని ఒక లేఖలో ఠాక్రే పేర్కొన్నారు. ఠాక్రే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని షిండే వర్గానికి చెందిన ప్రతినిధి దీపక్ కేసర్కర్ గోవాలో విలేకరులతో అన్నారు. 'ఎన్నికయిన ఎమ్మెల్యేలందరూ షిండేను గ్రూప్ నాయకుడిగా నియమించారు. ఆయనను శాసనసభ గ్రూప్ నాయకుడిగా తొలగించడం కూడా సుప్రీం కోర్టులో సవాలు చేయబడింది.

మేమ ఠాక్రేకి చట్టబద్ధంగా ప్రతిస్పందిస్తాము' అని కేసర్కర్ నొక్కి చెప్పారు. ముఖ్యమంత్రిగా షిండే ఇప్పుడు శాసనసభాపక్ష నేతగా ఉన్నారని ఆయన అన్నారు. 'ఉద్ధవ్ ఠాక్రే నుంచి ఎటువంటి ప్రకటనలకు మేము స్పందించబోమని మేము నిర్ణయించుకున్నాము. అతను మా నాయకుడు, మేము అతనిని గౌరవిస్తాము' అని సావంత్‌వాడి ఎమ్మెల్యే అన్నారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి హాజరయ్యేందుకు షిండే వర్గం శనివారం రాత్రికి తిరిగి ముంబైకి చేరుకునే అవకాశం ఉంది.

కాంగ్రెస్‌కు దెబ్బమీద దెబ్బ

శివసేనలో చీలికతో
మహారాష్ట్రలో అధికారానికి దూరం
రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లోనే అధికారం

న్యూఢిల్లీ : ఒకప్పుడు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రాంతీయ పార్టీ స్థాయికి చేరుకునే పరిస్థితుల్లో ఉంది. ఇది మునిగిపోయే నావ అనే వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఒకదాని తర్వాత ఒకటిగా రాష్ట్రాలను కోల్పోతూ వచ్చిన ఈ పార్టీ తాజాగా మహారాష్ట్రలో మిత్రపక్షం శివసేనలో చీలిక కారణంగా అధికారాన్ని కోల్పోయింది. ప్రస్తుతం రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉంది. అక్కడ కూడా పార్టీలో అంతర్గత విభేదాలు ఉండడంతో ఆ రాష్ట్రాలు ఎంతవరకు నిలుపుకుంటోందో అన్న అబినుమానం రాజకీయ విశ్లేషకులలో ఉంది. దెబ్బమీద దెబ్బ పడడం, ఎన్నికల్లో వరుస పరాభవాలతో డీలా పడిపోయింది. దీంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు ఆత్మపరిశీలన చేసుకునేందుకు, భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన 'చింతన్ శిబిర్"లో చేసిన తీర్మానాలను ఆచరణలో పెట్టే క్రమంలో ఎదురుదెబ్బలు తప్పడం లేదు. పార్టీ నేతల్లో 'పదవు'ల వాంఛ కూడా ఈ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది.

మహారాష్ట్రలో నాటకీయ పరిణామాల నేపథ్యంలో శివసేనతో పాటు కాంగ్రెస్ అధికారానికి దూరమైంది. అంతకుముందు మణిపూర్, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్ రాష్ట్రాలను కాంగ్రెస్ కోల్పోయింది. కేరళ, అసోం. పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లోనూ రాణించలేకపోయింది. తమిళనాడులో డీఎంకేకు జూనియర్ మిత్రపక్షంగా మిగిలింది. అయితే ప్రభుత్వంలో భాగస్వామి కాలేదు. మహారాష్ట్రలో అనూహ్య పరిణామాలతో ఈ పార్టీ మరోసారి డీలాపడింది. నేతలు, కార్యకర్తలను ఏకంగా ఉంచేందుకు నానా తంటాలు పడుతోంది. ఒక్కొక్కరిగా నేతలను కోల్పోతోంది. ఇప్పటికే కేంద్ర మాజీ మంత్రులు అశ్విని కుమార్, ఆర్‌పీఎన్ సింగ్, గోవా మాజీ సీఎం ల్యుజిన్హో ఫలేరియో, పంజాబ్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సునీల్ ఝాకర్, గుజరాత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు హార్దిక్ పటేల్, పార్టీ అసోం అధ్యక్షుడు రిపున్ బోరా, రాజ్యసభలో చీఫ్ విప్ భువనేశ్వర్ కలితా హస్తం పార్టీకి మొండి చేయి చూపారు. జితిన్ ప్రసాదా, జ్యోతిరాదిత్య సింధియా, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సుస్మితా దేవ్, పీసీ చాకో కూడా గుడ్‌బై చెప్పేశారు. కర్ణాటక, పుదుచ్చేరి, మధ్యప్రదేశ్‌లోనూ తిరుగుబాటు రాజకీయాలు కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేశాయి. 2019లో కర్ణాటక, 2020లో మధ్యప్రదేశ్ ఇప్పుడు మహారాష్ట్రను కాంగ్రెస్ కోల్పోయింది. ఉదయ్‌పూర్‌లో హిందూ దర్జీ హత్య నేపథ్య పరిస్థితుల దృష్ట్యా రాజస్థాన్‌లోని అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం రాష్ట్రంలో నిషేధాజ్ఞలు అమలు చేసింది. మతహింస ద్వారా బీజేపీ లబ్ధి పొందుతూ రాగా వచ్చే ఏడాది రాజస్థాన్ అసెంబ్లీకి జరగాల్సి ఉన్న ఎన్నికలు ఏ విధంగా పరిణమిస్తాయన్న ఆందోళన హస్తం పార్టీలో ఉంది. బీజేపీ మాస్టర్‌స్ట్రోక్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలెట్‌పై నిఘా కాంగ్రెస్‌కు అవసరం అన్న భావన పార్టీ వర్గాల్లో ఉంది. పైలెట్‌కు గెహ్లాట్‌కు మధ్య సత్సంబంధాలు లేకపోవడమే కాకుండా ఉన్నత పదవిని పైలెట్ ఆశిస్తుండటంతో ఆయన అనుచరగణం అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరుగుబాటు చేయొచ్చు అని పార్టీ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ప్రజాదరణ, అనుభంగల గెహ్లాట్‌ను తప్పించి పైలెట్‌ను అందలం ఎక్కించడం చెప్పినంత సులువు కాదు. ఈలోగా బీజేపీ ఎత్తుగడలు వేస్తోంది. దర్జీ కన్హయ లాల్ హత్యను పెద్దది చేస్తూ మతపరమైన భావాలను తీవ్రంగా రెచ్చగొడుతోంది. ఉదయ్‌పూర్ ఘటన వల్ల మతఘర్షణ తలెత్తి పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయన్న భయం కాంగ్రెస్ నేతల్లో ఉంది. మధ్యప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలను చేజార్చుకున్న క్రమంలో కాంగ్రెస్ ఎన్నికల నిధి కూడా తగ్గిపోతోంది. జార్ఖండ్‌లోని అధికార జేఎంఎంతోనూ ఈ పార్టీ ఇబ్బందులను ఎదుర్కొంటోంది. కాంగ్రెస్‌కు ఒక్క రాజ్యసభ స్థానాన్ని ఇవ్వలేదు. ప్రతిపక్షం తరపునర రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు మద్దతివ్వడంపైనా ఆ పార్టీలో స్పష్టత లేదు. వచ్చే ఏడాది రాజస్థాన్,చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న క్రమంలో తమ పార్టీని బలపర్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. కానీ పరిస్థితులు అనుకూలించడం లేదు. ఇదే కొనసాగితే రాజస్థాన్, చత్తీస్‌గఢ్ కూడా 'చేయి' జారిపోయే ప్రమాదం లేకపోలేదు.

పాత్రికేయులకు కరువైన స్వేచ్ఛ

కశ్మీరీ ఫొటోగ్రాఫర్, పులిట్జర్ అవార్డుగ్రహీత విదేశీయానానికి అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ : దేశంలో ప్రతికా స్వేచ్ఛ అథమస్థానానికి చేరుకుంది. మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాత్రికేయులు తమ పనిని స్వతంత్రంగా చేసుకునే పరిస్థితి ఉండటం లేదు. అనేక ఆంక్షలతో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తుండటం విదితమే. తాజాగా కశ్మీరీ జర్నలిస్టుకు చేదు అనుభ వం ఎదురైంది. పులిట్జర్ అవార్డు గ్రహీత, కశ్మీరీ ఫొటోగ్రాఫర్ సనా ఇర్షాద్ మట్టోను విదేశాలకు వెళ్లకుండా విమానాశ్ర యంలో అధికారులు నిలువరించారు. అలా ఎందు కు చేశారన్నది చెప్పలేదు. అకారణం గా తన విదేశీ యానానికి అనుమతిలేదని చెప్పారు. ఢిల్లీ నుంచి పారిస్‌కు వెళ్లే సనా ఇర్షాద్‌ను ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. ఫ్రెంచ్ వీసా ఉన్నాగానీ ఆమెను ప్రయాణించనివ్వలేదు. తన ఫొటోలకుగాను 2022 పులిట్జర్ అవార్డును అందుకున్న వారిలో సనా ఇర్షాద్ మట్టో ఉన్నారు. 2020 సెరెండిపిటీ ఆర్లెస్ గ్రాంట్ పది అవార్డు గ్రహీతల్లో ఒకరిగా ఫొటోగ్రఫీ ప్రదర్శన, పుస్తకావిష్కరణ కోసం పారిస్ వెళ్లాల్సిన తనను అధికారులు నిలువరించినట్టు ఆమె ట్వీట్ చేశారు. విదేశీయానానికి అనుమతి లేదని చెప్పారు తప్ప అది ఎందుకో మాత్రం అధికారులు ఆమెకు తెలుపలేదు. 2022, మేలో సనా ఇర్షాద్ మట్టో ఫ్రీలాంసర్ ఫొటోగ్రాఫర్‌గా పులిట్జర్ పురస్కారాన్ని అందుకున్నారు. ర్యూటర్స్ ప్రచురిత ఫొటోకుగాను ఫీచర్‌ఫొటోగ్రఫీ విభాగంలో అవార్డు పొందారు. కీశే దానిశ్ సిద్దీఖీ, అమిత్ దవే, అద్నాన్ అబీదితో పాటు ర్యూటర్స్ బృందంతో పురస్కారాన్ని పంచుకున్నారు. భారత్‌లో కోవిడ్-19 వార్తాసేకరణకుగాను వీరంతా ఈ ప్రతిష్టాత్మక అవార్డు గ్రహీతలయ్యారు. కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి కన్వర్జెంట్ జర్నలిజంలో మాస్టర్స్ చేసిన సనా ఇర్షాద్ తీసిన ఫొటోలు ప్రపంచవ్యాప్తంగా అనేక మాధ్యమాల్లో ప్రచురితమయ్యాయి. 2021లో ప్రతిష్టాత్మక మ్యాగ్నమ్ ఫౌండేషన్ ఫెల్లోషిప్‌ను ఆమె పొందారు. ముందస్తు సమాచారం లేకుండా కశ్మీరీ జర్నలిస్టును విదేశాలకు వెళ్లకుండా అడ్డుకోవడం ఇది మొదటిసారి కాదు. 2019, సెప్టెంబరులోనూ ఇలా జరిగింది. అధికరణ 370 రద్దు చేసినప్పుడు పాత్రికేయులు, రచయిత్రి గౌహర్‌గీలానీ న్యూఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బాన్‌కు వెళ్లాల్సి ఉండగా అధికారులు అడ్డుకొని ప్రయాణానికి అనుమతించలేదు.

జ్యుడీషియల్ రిమాండ్‌కి సెతల్వాడ్, శ్రీకుమార్

తదుపరి కస్టడీ కోరని పోలీసులు

అహ్మదాబాద్ : 2002 గుజరాత్ అల్లర్ల కేసులకు సంబంధించి కల్పిత సాక్ష్యాధారాల ఆరోపణలపై అరెస్టయిన కార్యకర్త తీస్తా సెతల్వాడ్, పోలీసు మాజీ డైరెక్టర్ జనరల్ ఆర్.బి.శ్రీకుమార్‌ని శనివారం ఇక్కడి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. పోలీసు కస్టడీ ముగిసిన తర్వాత ఇద్దరిని మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.పి.పటేల్ ఎదుట హాజరుపరిచారు. అయితే తదుపరి రిమాండ్‌ని పోలీసులు కోరలేదని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ తెలిపారు. అహ్మదాబాద్ పోలీసు క్రైమ్ బ్రాంచ్ గత శనివారం నమోదు చేసిన ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్‌ఐఆర్)పై సెతల్వాడ్, శ్రీకుమార్‌ని అరెస్టు చేశారు. 'దర్యాప్తు అధికారి తదుపరి కస్టడీని కోరలేదు. అందుకే వారిని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు' అని ప్రాసిక్యూటర్ పటేల్ తెలిపారు. గత శనివారం శ్రీకుమార్‌ను, మరుసటి రోజు సెతల్వాడ్‌ని ముంబైలోని ఆమె ఇంటి నుంచి గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ తీసుకెళ్లి అరెస్టు చేసింది. కాగా బనస్కాంత జిల్లాలోని పాలన్‌పూర్ జైలులో కస్టడీ డెత్ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఐపీఎస్ మాజీ అధికారి సంజీవ్ భట్ కూడా ఈ కేసులో నిందితుడిగా ఉన్నారు. బదిలీ వారెంట్‌పై ఆయనను అహ్మదాబాద్‌కు తీసుకురానున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. 2002 గోధ్రా అనంతర అల్లర్ల కేసుల్లో అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీతో పాటు మరికొందరికి ప్రత్యేక దర్యాప్తు బృందం ఇచ్చిన క్లీన్ చిట్‌ను సవాలు చేస్తూ దాఖలయిన పిటీషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిన ఒక రోజు తర్వాత క్రైమ్ బ్రాంచ్ వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. గుజరాత్ అల్లర్ల కేసుల్లో అమాయకులను ఇరికించే ప్రయత్నంలో శ్రీకుమార్, సెతల్వాడ్, భట్ కల్పిత సాక్ష్యాలను సృష్టించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. అల్లర సమయంలో హత్యకు గురైన కాంగ్రెస్ మాజీ ఎంపీ ఎహసాన్ జాఫ్రీ భార్య జాకియా జాఫ్రీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ అత్యున్నత న్యాయస్థానం 'గుజరాత్ రాష్ట్రంలోని అసంతృప్త అధికారులు, ఇతరులతో కలిసి వారి స్వంత అవగాహనకు తప్పుడు విషయాలు వెల్లడించడం ద్వారా సంచలనం సృష్టించడం' అని వ్యాఖ్యానించింది. సెతల్వాడ్, శ్రీకుమార్, భట్‌లకు వ్యతిరేకంగా పోలీసులు భారతీయ శిక్షాస్మృతి సెక్షన్లు 468, 471 (ఫోర్జరీ), 194 (మరణ శిక్ష నేరాన్ని నిర్ధారించే ఉద్దేశంతో తప్పుడు సాక్ష్యం ఇవ్వడం లేదా కల్పించడం), 211 (గాయానికి కారణమయ్యే నేరపూరిత చర్యలు), 218 (ప్రజాసేవకుడు తప్పు రికార్డును రూపొందించడం లేదా వ్యక్తిని శిక్ష నుంచి లేదా ఆస్తిని జప్తు నుంచి రక్షించే ఉద్దేశంతో వ్రాయడం), 120 (బి) (నేరపూరిత కుట్ర) కింద అభియోగాలు నమోదు చేశారు. అల్లర్ల కేసులను విచారణ చేసేందుకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన సిట్‌తో పాటు జస్టిస్ నానావతి-షా విచారణ కమిషన్ ముందు నిందితుల వాదనలను పోలీసులు పరిగణనలోకి తీసుకున్నారు. ఈ కేసును దర్యాప్తు చేసేందుకు గుజరాత్ ఏటీఎస్ డీఐజీ దీపన్ భద్రన్ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని గుజరాత్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

కోట్లాదిమందికి జీవనం నరేగా

నిజం గుర్తించడానికి మోదీ నిరాకరణ

రాహుల్‌గాంధీ విమర్శ



వయనాడ్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజీఎన్ఆర్ఈజీఏ-నరేగా) కోట్లాదిమంది భారతీయులకు కోవిడ్ సమయంలో ఓ రక్షకుడిగా ఉపయోగపడిందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ గురువారం చెప్పారు. కానీ యూపీఏ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకం ద్వారా దేశంలోని నిస్సహాయులకు ఊరట, భద్రత కలిగిందని, దీనిని గుర్తించడానికి ప్రధాని నరేంద్రమోదీ సిద్ధంగా లేరని ఆరోపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో నరేగాను అతిపెద్ద విఫల పథకంగా మోదీ అభివర్ణించడాన్ని రాహుల్ తప్పుబట్టారు. ప్రజలకు పెద్దఎత్తున ఉపాధి కల్పించే ఈ పథకం లోతు గురించి ప్రధాని అర్థం చేసుకోలేకపోతున్నారని మండిపడ్డారు. దేశంలోని కూలీల మార్కెట్‌గా ఎలా మారిందో..కోట్లాదిమంది ప్రజలకు రక్షణగా, ఓ గమ్యస్థానంగా ఎలా ఎదిగిందో గుర్తించడానికి మోదీ నిరాకరిస్తున్నారని విమర్శించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీని హడావుడిగా అమలు చేసిన కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని, సామాన్యుల జీవనానికి ఈ పథకం ఎంత భద్రత కలిగించిందో ఇప్పటికీ కంటికి కనిపిస్తోందని వివరించారు. తన పార్లమెంటరీ నియోజకవర్గం వయనాడ్‌లో గిరిజనులు అత్యధిక సంఖ్యలో గల నెన్మేని గ్రామంలో ఉపాధి హామీ కూలీల సమావేశంలో రాహుల్ మాట్లాడారు. కోవిడ్ సమయంలో లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోవడం, వారందరికీ ఉపాధి హామీ చట్టం రక్షణ కల్పించడాన్ని తాను స్వయంగా చూశానని చెప్పారు. కరోనా కాలంలో ప్రజలను ఆదుకున్న ఈ పథకం పూర్తిగా విఫలమైందని మోదీ చెప్పడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ఈ పథకాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న సమయంలో అధికార యంత్రాంగం, ఇతరులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేశారని, దీనివల్ల పెద్దమొత్తంలో డబ్బు వృథా అవుతుందని చెప్పారని రాహుల్ గుర్తు చేశారు. అయితే ఈ పథకం దేశాన్ని హుందాగా నిలపడానికి సహకరించిందన్నారు. దేశంలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి, కూలీలు గౌరవంగా తలెత్తుకొని బతకడానికి దోహదపడిందని చెప్పారు. ఉపాధి హామీ పథకం మన ప్రజల రక్షణ కోసం రూపొందించామని, అదే సమయంలో ఇది పూర్తిగా దాతృత్వం కోసం చేసింది కాదని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి వ్యతిరేకంగా మోదీ పార్లమెంటులో మాట్లాడటం తనకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు.

శివసేన నుంచి ముంబైని లాక్కునేందుకే...

షిండేకు సీఎం పదవిపై రౌత్ - బీజేపీపై విమర్శలు

ముంబై : ముంబైను శివసేన నుంచి లాక్కొనేందుకు ఏక్‌నాథ్ షిండేను మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీ చేసిందని శివసేన నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. ముంబైలో శివసేనను ఓడించేందుకు షిండేను వాడుకున్నారని తేలిపోయిందని చెప్పారు. శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే జూన్ 29న ముఖ్యమంత్రిగా రాజీనామా చేశారు. షిండే తిరుగుబాటు క్రమంలో ఆయనపై పార్టీ వేటు వేసింది. బీజేపీ కుయుక్తులు ప్రదర్శించి అధికారాన్ని చేజిక్కించు కుంది. షిండేకు సీఎం పదవి కట్టబెట్టింది. మాజీ సీఎం, పార్టీలో ముఖ్యనేత దేవంద్ర ఫడ్నవీస్‌కు ఉప ముఖ్యమంత్రి బాధ్యలు అప్పగించింది. రౌత్ శనివారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన షిండేను బహిష్కరించినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని ఉద్ధవ్ ఠాక్రే శుక్రవారం స్పష్టం చేశారన్నారు. కాంగ్రెస్ అనేకమార్లు చీలిందిగానీ ఇందిరాగాంధీ కాంగ్రెస్ మనుగడ సాగిస్తోంది. అలాగే ఠాక్రే ఉన్నచోటే శివసేన ఉంటుంది అని ఆయన అన్నారు. ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించినందుకు అభినందించాలన్నారు. బీజేపీ ఆదేశాలను పాటిస్తున్నారని వ్యాఖ్యానించారు. మనీలాండరింగ్ కేసు విచారణ క్రమంలో శుక్రవారం ఈడీ ఎదుట రౌత్ హాజరయ్యారు. ఎలాంటి ప్రశ్నలకైనా సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థకు చెప్పారు. పది గంటల పాటు ఈడీ విచారణ సాగిందని, వారికి కావాల్సిన సమాచారాన్ని ఇచ్చానని విలేకరులకు రౌత్ తెలిపారు. భయపడాల్సిన పనిలేదని, తాను ఏ తప్పు చేయలేదని, నిజం తన వెంటే ఉందని అన్నారు.

నూపుర్‌శర్మ వ్యాఖ్యలపై

దద్దరిల్లిన ఒడిశా అసెంబ్లీ

బీజేపీ, కాంగ్రెస్ పరస్పర దూషణలు

భువనేశ్వర్: మహ్మద్ ప్రవక్తపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నూపుర్‌శర్మ వ్యవహారం ఒడిశా అసెంబ్లీని శనివారం కుదిపేసింది. రెండు ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, బీజేపీ పరస్పర విమర్శలు గుప్పించాయి. దీంతో అసెంబ్లీ అనేకసార్లు వాయిదా పడింది. నూపుర్‌శర్మ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు అక్షింతలు వేయడాన్ని కాంగ్రెస్ పదేపదే ప్రస్తావించింది. జీరో అవర్‌లో ఈ అంశాన్ని సీఎల్‌పీ నేత నరసింగ మిశ్రా లేవనెత్తారు. శర్మ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభిప్రాయం తెలుసుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 'నూపుర్ శర్మ బీజేపీ అధికార ప్రతినిధి లేదా ఏజెంటు. సుప్రీంకోర్టు శుక్రవారం ఆమెను తీవ్రంగా ఆక్షేపించింది. పరోక్షంగా బీజేపీని నిందించింది' అని మిశ్రా ఆరోపించారు. దీనికి బీజేపీ బాధ్యత వహించాలని, తన బాధ్యత నుంచి బీజేపీ తప్పించుకోజాలదని సీఎల్‌పీ నేత వ్యాఖ్యానించారు. బీజేపీ లక్ష్యంగా మిశ్రా మాట్లాడుతుండగా సభలో గందరగోళం చెలరేగింది. మిశ్రా వ్యాఖ్యలకు బీజేపీ సభ్యులు రెచ్చిపోయారు. తమ సీట్లలో నిలబడి ఆందోళన చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధికారం వెలగబెడుతున్న రాజస్థాన్‌లో ఇటీవల ఓ టైలర్‌ను దారుణంగా చంపేశారని బీజేపీ ఉప నాయకుడు బీసీ సేథీ ఎదురుదాడికి దిగారు. ఈ హత్య తర్వాత ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. నూపుర్‌శర్మ ఒడిశా అసెంబ్లీ సభ్యురాలు కాదని, ఆమె వ్యాఖ్యలపై ఇక్కడ చర్చించుకని అడిగారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.